

ఆర్‌కె పంక్షన్ హాలు ఎదుట టిడిపి నంద్యాల జిల్లా అధ్యక్షులు మల్లెల రాజశేఖర్ , ఇతర నాయకులు

మద్యం, గంజాయి వలన మహిళలపై వేధింపులు

- వైసిపి పాలనలో కీచకులు ఉన్నారు
- మహిళల ఆర్థికాభివృద్ధే టిడిపి లక్ష్యం
- మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

ప్రజాశక్తి-బనగానపల్లె

రాష్ట్రంలో మద్యం, గంజాయి వల్ల మహిళలపై దాడులు, అత్యాచారాలు, గృహ హింస పెరిగి పోయాయని, వైసిపి పాలనలో కీచకులు ఉన్నారని, తెలుగుదేశం పాలనలో ఆడబిడ్డలు అన్ని విధాల అభివృద్ధి సాధించారని, మహిళలకు గుర్తింపు వచ్చింది, వస్తోందని మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. శుక్రవారం నంద్యాల జిల్లా బనగానపల్లె పట్టణంలోని జిఎంఆర్ ఫంక్షన్ హాల్లో మాజీ ఎమ్మెల్యే బిసి జనార్ధన్ రెడ్డి సతీమణి బిసి ఇందిరారెడ్డి అధ్యక్షతన మహిళాశక్తి కార్యక్రమంలో భాగంగా మహిళా ప్రజా వేదిక- మహిళలతో ముఖాముఖి కార్యక్రమం చంద్రబాబు నిర్వహించారు. మహిళల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైసిపి పాలనలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేసి మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ఆడబిడ్డలు చదువుకుని ఉద్యోగాలు చేయాలనే సంకల్పంతో కిలోమీటరుకు ఒక ప్రాథమిక పాఠశాల, 5 కిలోమీటర్లకు ఒక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రతి మండలానికి జూనియర్ కళాశాల నియోజకవర్గ కేంద్రంలో డిగ్రీ కళాశాలలను ఏర్పాటు చేశామన్నారు. 1986లో అప్పటి ముఖ్యమంత్రి ఎన్‌టిఆర్ మహిళలకు ఆస్తిలో సమాన హక్కును కల్పించినట్లు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలకు రిజర్వేషన్లను ఏర్పాటు చేసిన ఘనత మాపార్టీదేనని అన్నారు. చట్టసభల్లో 33 శాతం మహిళలకు రిజర్వేషన్లు కల్పించేందుకు తాము పోరాడుతున్నామని, మహిళల పోరాటానికి అండగా ఉంటామని తెలిపారు. రాష్ట్రంలో టిడిపి పాలనలో పరిశ్రమలను ఏర్పాటు చేసి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి విధ్వంస పాలనలో ఉన్న పరిశ్రమలను రాష్ట్రం నుండి వెళ్లగొట్టి నిరుద్యోగ సమస్యను పెంచినట్లు విమర్శించారు. టిడిపి మేనిఫెస్టోలో మహిళా శక్తి కార్యక్రమంలో ద్వారా మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు ఎన్నో పథకాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తాము అధికారంలోనికి వస్తే సంవత్సరానికి నాలుగు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామన్నారు. జిల్లాలో మహిళలు ఆర్‌టిసి బస్సుల్లో ఉచిత ప్రయాణం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. 18 సంవత్సరాలు దాటిన ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఇస్తామన్నారు. విద్యార్థి వన పథకం కింద ఒక ఇంటిలో ఎంతమంది పిల్లలు చదువుకుంటే అంతమందికి సంవత్సరానికి రూ.15000 ఇస్తామన్నారు. నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి కింద నెలకు రూ.3000 ఇస్తామన్నారు. వైసిపి పార్టీ మహిళలను వేధించే వారికి ఎంపీ ఎమ్మెల్యే టికెట్లు ఇస్తుందని విమర్శించారు. వైసిపి పాలనలో నిత్యవసర ధరలు పెరిగిపోవడంతో మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వైసీపీ ప్రభుత్వం ఎనిమిది సార్లు కరెంటు చార్జీలను పెంచినట్లు తెలిపారు. టిడిపి అధికారంలోనికి వస్తే విద్యుత్ చార్జీలుపెంచ బోమన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తాము అధికారంలోనికి వస్తే మద్య నిషేధం చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక మద్యాన్ని తాకట్టుపెట్టి రూ.14 వేల కోట్లు అప్పు తెచ్చారని విమర్శించారు. మహిళలకు భద్రత కల్పించడంలో దేశంలో రాష్ట్రం 22వ స్థానానికి పడిపోయిందన్నారు. అరాచక పాలనకు రాక్షసపాలనకు ప్రజలు చమర గీతం పాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు కోట్ల సుజాతమ్మ, గౌరు చరిత, మాజీ జెడ్పిటిసి ప్రసన్న లక్ష్మి, మహేశ్వరి, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

మహిళా సాధికారత టిడిపిలోనే సాధ్యం : బిసి ఇందిరా

టిడిపి పాలనలోనే మహిళల సాధికారత సాధ్యమని మాజీ ఎమ్మెల్యే బిసి జనార్దన్ రెడ్డి సతీమణి బిసి ఇందిర పేర్కొన్నారు. మహిళాశక్తి కార్యక్రమంలో భాగంగా మహిళా ప్రజా వేదిక ముఖాముఖి కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలిపించాలన్నారు. టిడిపి పాలనలోనే మహిళలకు గుర్తింపు సాధ్యమన్నారు. డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేసి అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేశారని తెలిపారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయితే పరిశ్రమలను ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతీ ఒకరు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. బిడ్డల భవిష్యత్తు కోసం రాష్ట్ర భవిష్యత్తు కోసం వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం ప్రభుత్వాన్ని గెలిపించాలన్నారు.

చంద్రబాబుకు ఘన స్వాగతం

పట్టణంలోని జిఎంఆర్ ఫంక్షన్ హాల్ లో మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా మహిళా ప్రజా వేదిక మహిళలతో ముఖాముఖి కార్యక్రమానికి వచ్చిన మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు టిడిపి నాయకులు ఘన స్వాగతం పలికారు. శుక్రవారం పట్టణంలోని జిఎంఆర్ ఫంక్షన్ హాల్ వద్దకు వచ్చిన చంద్రబాబు నాయుడుకు మాజీ ఎమ్మెల్యే బిసి జనార్దన్ రెడ్డి స్వాగతం పలికారు. టిడిపి జిల్లా అధ్యక్షులు మల్లెల రాజశేఖర్, ఎమ్మెల్సీ భీమ్ రెడ్డి రాంగోపాల్ రెడ్డి, నంద్యాల పార్లమెంట్ ఇన్చార్జి మాండ్రా శివానందరెడ్డి, మాజీ మంత్రి భూమా అఖిలప్రియ, కర్నూలు, ఆత్మకూరు, డోన్ టిడిపి నియోజకవర్గ ఇన్చార్జులు టిజి. భరత్, బుడ్డా రాజశేఖర్ రెడ్డి, ధర్మవరం సుబ్బారెడ్డిలు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కుఘన స్వాగతం పలికారు.

మహిళా శక్తి కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

చంద్రబాబు నాయుడుకు స్వాగతం పలుకుతున్న మాజీ ఎమ్మెల్యే బిసి దంపతులు

చంద్రబాబు అరెస్టుపై పుకార్లు

నంద్యాల ఆర్‌కె పంక్షన్ హాలుకు చేరిన ముఖ్యనాయకులు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యా జిల్లా పర్యటనలో ఉన్న మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును అరెస్టు చేస్తారని పుకార్లు రావడంతో నంద్యాల, కర్నూలు జిల్లాల ముఖ్యనాయకులు చంద్రబాబునాయుడు బసచేసిన నంద్యాల ఆర్‌కె.పంక్షన్‌హాలుకు చేరుకున్నారు. ఇటీవల ఆయనకు ఐటి నోటీసులు ఇచ్చిన నేపథ్యంలో తనను అరెస్టు చేసే అవకాశం ఉందని చంద్రబాబునాయుడు స్వయంగా ప్రకటించారు. అయితే శుక్రవారం నంద్యాల పర్యటనలో ఉన్న చంద్రబాబునాయుడు బహిరంగసభ అనంతరం ఆరెకె పంక్షన్‌హాలులో బసచేస్తున్నారు. ఈ వార్త తెలిసిన నాయకులు, మీడియా ప్రతినిధులు అంతా అక్కడే ఉన్నారు. మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, టిడిపి కర్నూలు, నంద్యాల జిల్లాల ముఖ్యనాయకులు వచ్చారు. తెల్లవారుజామున మూడు గంటల ప్రాంతంలో అరెస్టు చేస్తారనే సమాచారం వచ్చిందని నంద్యాల జిల్లా టిడిపి అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్‌గౌడ్ మీడియాతో మాట్లాడుతూ చెప్పారు. మచ్చలేని మానాయకుడిని అరెస్టు చేస్తే ఊరుకోమని తామంతా అడ్డుకుంటామని ఆయన తెలిపారు. అవినీతిపరుడైన అవినాష్‌రెడ్డిని అరెస్టుకు సిబిఐ వస్తే వైసిపి కార్యకర్తలు అడ్డుకున్నారని మానాయకుడిని అరెస్టు చేస్తే తామెలా ఊరుకుంటామని అన్నారు. భారీఎత్తున కార్యకర్తలను రప్పిస్తున్నారు. ఇప్పటికే పలువురు ఆర్‌కెపంక్షన్ హాలుకు చేరుకున్నారు.

ప్రజా వినతులకు తక్షణ పరిష్కారం : కలెక్టర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

వినతులు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్

ప్రజా వినతులకు తక్షణ పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ అధికారులను ఆదేశించారు. మండల స్థాయిలో పరిష్కరించే చిన్న చిన్న సమస్యలు సైతం కలెక్టరేట్‌కు వస్తున్న నేపథ్యంలో మండల స్థాయిలో స్పందన కార్యక్రమాన్ని నిర్వహించాలని ప్రభుత్వ సూచన మేరకు శుక్రవారం గోస్పాడు మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో జగనన్నకు చెబుదాం - స్పందన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి, డిఆర్ఓ పుల్లయ్య ఇతర జిల్లా అధికారులు ప్రజల నుండి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్పందన కార్యక్రమం ద్వారా మండల స్థాయిలో పరిష్కరించే ప్రజా ఫిర్యాదులకు మరింత మెరుగైన సర్వీసులు అందించాలని అధికారులకు సూచించారు. సాధ్యమైనంతవరకు స్వీకరించిన దర ఖాస్తులను అక్కడికక్కడే పరిష్కరించి అర్జీదారుల్లో సంతృప్తి స్థాయిని పెంచాలన్నారు. మంచినీటి వసతి కల్పించాలని, కాలువలలో పూడిక తీయడం లేదని, పారిశుధ్య చర్యలు చేపట్టాలని తదితర సమస్యలను మండల స్థాయి అధికారులే పరిష్కరించాలని సూచించారు. స్పందన కార్యక్రమంలో 29 మంది తమ సమస్యల పరి ష్కారానికి అర్జీలు సమర్పించారు. ఈ సమస్యలన్నీ విథిన్ ఎస్‌ఎల్‌ఏలోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో సుబ్బారెడ్డి, మండల అధ్యక్షులు సైమాన్, ఎంపిడిఓ భాస్కర్, తహశీల్దార్ విజయ శేఖర్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైసిపి ప్రభుత్వంలో ఒక్క పరిశ్రమ లేదు..

- వచ్చే ఎన్నికల్లో వైసిపి చిత్తుగా ఓడిపోవడం కాయం
- మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

వైసిపి ప్రభుత్వంలో కర్నూలు, నంద్యాల జిల్లాలకు ఒక్క పరిశ్రమ కూడా తేలేదని తెలుగుదేశం పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సిఎంపై నిప్పులు చెరిగారు. బాబు షూరిటీ-భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నంద్యాలలోని రాజ్ థియేటర్ వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో చంద్రబాబు నాయుడు మాట్లాడారు. రాయలసీమ సస్యశామలం కోసం తెలుగుదేశం హయాంలో పూర్తి చేసిన ప్రాజెక్టుల ద్వారా కాలువలకు నీళ్లు ఇవ్వలేని పరిస్థితిలో జగన్ ప్రభుత్వం ఉందన్నారు. సిఎం జగన్ రాయలసీమ ద్రోహి అని, కరుడు గట్టిన నేరస్తుడని, ప్రజల రక్తం తాగుతున్నాడని, అన్ని రంగాలు దెబ్బ తింటున్నాయని, రోడ్లు సరిగ్గా లేవని, అన్ని ప్రభుత్వ శాఖలకు హోలిడే ప్రకటించారని అన్నారు. నంద్యాలలో సలాం కుటుంబం చనిపోయినప్పుడు ప్రభుత్వం ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. నంద్యాలలో సండే ఎమ్మెల్యే తన అనుచరులకు ఎర్రమట్టి, బియ్యం, అన్ని కూడబెడుతూ ప్రజాధనాన్ని కొల్లగొడుతున్నారని తెలిపారు. సైకో జగన్‌ను ఇంటికి సాగనంపాలన్నారు. నంద్యాలకు పూర్వ వైభవం రావాలంటే టిడిపిని గెలిపించాలని ప్రజలను కోరారు. బహిరంగ సభ అనంతరం ఆర్‌కె ఫంక్షన్ హాల్‌లో చంద్రబాబునాయుడు రాత్రి బస చేశారు. ఈ కార్యక్రమంలో నంద్యాల నియోజకవర్గ ఇన్చార్జి భూమా బ్రహ్మానంద రెడ్డి, పొలిట్ బ్యూరో సభ్యులు ఎన్ఎండి ఫరూక్, మాజీ మంత్రులు ఏరాసు ప్రతాపరెడ్డి, భూమా అఖిల ప్రియ, జిల్లా అధ్యక్షులు మల్లెల రాజశేఖర్ గౌడ్, బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి, నాయకులు ఎవి సుబ్బారెడ్డి, ఎన్ఎండి ఫిరోజ్, మౌలానా ముస్తాక్ అహ్మద్, భూమా జగత్ విఖ్యత్ రెడ్డి, తాతిరెడ్డి తులసి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భారీ గజమాలతో స్వాగతం పలికిన టిడిపి నాయకులు

చంద్రబాబు నాయుడుకు నంద్యాల బైపాస్ టర్నింగ్ వద్ద టిడిపి నాయకులు భారీ గజమాలతో స్వాగతం పలికారు. మాజీ మంత్రి ఫరూఖ్, మాజీ ఎమ్మెల్యేలు భూమా బ్రహ్మానంద రెడ్డి, జయనాగేశ్వర రెడ్డి, ఎవి సుబ్బారెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు వెదుర్ల రామచంద్రరావు, ఏవిఆర్ ప్రసాద్, నంద్యాల పరిశీలకులు పోతురాజు రవికుమార్, జిల్లా అధ్యక్షులు మల్లెల రాజశేఖర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్, న్యాయవాది తులసిరెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న చంద్రబాబు నాయుడు

వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ

కిట్ల సరఫరాలో నిర్లక్ష్యం

- అంగన్‌వాడీ కార్యకర్తలే తెచ్చుకోవాలని హుకూం
- భారంగా మారుతున్న రవాణా ఖర్చులు

ప్రజాశక్తి - బనగానపల్లె రూరల్

ప్రభుత్వం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో వైఎస్ఆర్ సంపూర్ణ పోషకాహారం కిట్లలను, ఫేస్ యాప్ ద్వారా గర్భవతులు బాలింతలకు అంగనవాడి సెంటర్ల ద్వారా పంపిణీ చేస్తుంది. రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్న వైయస్సార్ పోషణ ఆహారం కిట్లను ప్రతి నెలా 5వ తేదీలోపు రేషన్ డీలర్ల ద్వారా అంగన్‌వాడీ సెంటర్లకు పంపిణీ చేసే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. బనగానపల్లె ప్రాజెక్టులోని బనగానపల్లె పట్టణంలో 20 అంగన్వాడీ సెంటర్లు ఉన్నాయి. రెండు మూడు అంగన్వాడీ సెంటర్లకు మాత్రమే డీలర్లు పంపిణీ చేసి మిగతా సెంటర్లకు పంపిణీ చేయడం లేదు. అంగనవాడీ కార్యకర్తలే ప్రైవేట్ ఆటోలో 200 నుండి 300 వరకు ఖర్చు చేసి ఎత్తుకొని వెళ్లాలని సూచిస్తున్నారు. ఈ ఖర్చు అంగన్వాడీ కార్యకర్తలకు భారంగా మారుతోంది. ఈ విషయాన్ని ఐసిడిఎస్, పిడి, సిడిపిఒ, సూపర్వైజర్లకు తెలియజేసినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. గర్భిణులకు, బాలింతలకు పంపిణీ చేయాల్సిందేనని హుకూం జారీ చేస్తున్నారు. ప్రభుత్వ యాప్‌లో ఇచ్చినట్లు నమోదు చేయాలని, అంగనవాడీ కార్యకర్తలను ఐసిడిఎస్ సిబ్బంది వేధింపులకు గురి చేస్తున్నారు. కొన్ని సెంటర్లలో అధికారులకు భయపడి ఫేస్ యాప్ ద్వారా నమోదు చేశారు. నమోదైన బాలింతలు, గర్భవతులు వైయస్సార్ సంపూర్ణ కిట్లు ఇవ్వాలని అడుగుతుండడంతో అంగన్వాడీ కార్యకర్తలు సమాధానం చెప్పలేక ఇబ్బందులు గురవుతున్నారు. రెవెన్యూ శాఖతో మాట్లాడి పరిష్కరించాల్సింది పోయి, ఐసిడిఎస్ అధికారులు అంగన్వాడీ కార్యకర్తలను వేధించడంతో పాటు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వచ్చే జీతాలలో బతకడమే కష్టంగా మారిపోయిందని, ఆటోలకు ఖర్చులు భరించి కిట్లు తెచ్చుకోలేమని వాపోతున్నారు. ప్రభుత్వమే తమ అంగన్‌వాడీ సెంటర్లకు 5వ తేదీ లోపు చేరేలా కృషి చేయాలని కోరుతున్నారు.

అతిసార తగ్గుముఖం

- గ్రామాల్లో వైద్య శిబిరాల నిర్వహణ
- ఆర్‌ఒ ట్యాంక్, ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా
- ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన జిల్లా అధికారులు

ప్రజాశక్తి - పగిడ్యాల

పగిడ్యాల, బీరవోలు, ఆంజనేయ నగర్ గ్రామాలలో అతిసార కేసులు తగ్గుముఖం పట్టాయి. శుక్రవారం కొత్తగా ఎలాంటి కేసులు రాలేదు. ఆయా గ్రామాలలో వైద్య సిబ్బంది ఇంటింటికి తిరిగి అవగాహన కల్పిస్తున్నారు. క్లోరిన్ గుళికలను ఒక బిందె నీటిలో ఒక గుళిక వేసి నీరు తాగాలని సూచిస్తున్నారు. గత మూడు రోజుల నుంచి 95 మందికి అతిసార సోకగా వారందరికీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స చేయడం అందిస్తున్నారు. దాదాపు 25 మంది కోలుకున్నారు. బీరవోలు, ఆంజనేయ నగర్ గ్రామాలలో వాడుకోవడానికి ఒక ట్రాక్టర్ ట్యాంకర్ ద్వారా, తాగడానికి ఆర్వో ట్యాంకు ద్వారా, పగిడ్యాల గ్రామంలో వాడుకునేందుకు మూడు ట్రాక్టర్ ట్యాంకుల ద్వారా, ఒక ఆర్వో ట్యాంకు ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నారు. గ్రామాలలో ఉన్న ఓవర్ హెడ్ ట్యాంకులు, జిఎల్ఆర్ఎస్ ట్యాంకులు, రౌండ్ ట్యాంకులను శుభ్రం చేసి క్లోరిన్ వేస్తున్నారు. పగిడ్యాల ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంలో మండల వైద్యాధికారి డాక్టర్ మోహన్, ఎంపీడీవో వెంకటరమణ వారు విలేకరులతో మాట్లాడారు. అతిసారా ప్రబలిన గ్రామాలలో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన జిల్లా అధికారులు

పగిడ్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిఎంహెచ్ఓ డాక్టర్ వెంకటరమణ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌సి మనోహర్, డిపిఓ మంజులవాణిలు శుక్రవారం సందర్శించారు. పరిస్థితులను వైద్య సిబ్బందిని అడిగి తెలుసు కున్నారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ వెంకటరమణ మాట్లాడారు. పగిడ్యాల, బీరవోలు, ఆంజనేయ నగర్ గ్రామాలలో ప్రస్తుతం కొనసాగుతున్న మెడికల్ క్యాంపులను కొనసాగించాలని మండల వైద్యాధికారి డాక్టర్ మోహన్‌కు సూచించారు. ప్రాథమిక వైద్య కేంద్రంలో పూర్తిస్థాయిలో మందులు ఉన్నాయని ఇంకా 500 మందికి సరిపడా మందులను తెప్పిస్తున్నామని ఆయన తెలిపారు. తగు జాగ్రత్తలను వైద్య సిబ్బందికి వారు సూచించారు.

పరిస్థితిని వివరిస్తున్న వైద్యులు

నెరవేరిన నంద్యాల ప్రజల కల

- 14న మెడికల్ కళాశాల ప్రారంభం
- వర్చువల్‌గా ప్రారంభించునున్న సిఎం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల జిల్లా ప్రజల మెడికల్ కళాశాల చిరకాల కల నెరవేరిందని ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి పేర్కొన్నారు. నంద్యాల మెడికల్ కళాశాలను ఈ నెల 14న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వర్చువల్ విధానంలో ప్రారంభించనున్న నేపథ్యంలో శుక్రవారం ఆయన మెడికల్ కళాశాలను సందర్శించారు. కళాశాల ప్రిన్సిపాల్ స్వర్ణలత, ప్రిన్సిపల్ డాక్టర్ లక్ష్మీప్రణవానంద కుమార్, మెడికల్ విద్యార్థులను ప్రొఫెసర్లను కలిశారు. మెడికల్ కళాశాలను ఉత్తమ కళాశాలగా పేరుప్రఖ్యాతలు తీసుకువచ్చేందుకు ప్రొఫెసర్స్, మెడికల్ విద్యార్థులు కృషి చేయాలని ఎమ్మెల్యే కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నంద్యాలలో మెడికల్ కళాశాల నిర్మాణం చేపట్టడానికి ఎన్నో అడ్డంకులు వచ్చాయని, వాటన్నింటిని అధిగమించి నిర్మాణాన్ని శరవేగంగా చేపట్టామన్నారు. ఛాలెంజ్‌గా తీసుకొని ఈ ఏడాది అడ్మిషన్లు జరిపామన్నారు. నంద్యాల మెడికల్ కళాశాలను ఎంపిక చేసుకున్న ప్రతి మెడికల్ విద్యార్థిని ప్రత్యేకంగా అభినందించారు. కళాశాలలో దశల వారిగా విద్యాపరమైన, హాస్టల్ సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నామని, ఎటువంటి సమస్య, వచ్చినా వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మెడికల్ కళాశాల ప్రొఫెసర్లు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.



మెడికల్ కళాశాల ను సందర్శించిన ఎమ్మెల్యే శిల్పా

ముకుందాపురంలో సిసి రోడ్డు నిర్మాణం

ప్రజాశక్తి - రుద్రవరం : మండలంలోని ముకుందాపురం గ్రామంలో రూ.18 లక్షల నిధులతో సిసి రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. శుక్రవారం ఆర్ అండ్ బి ఎ ఈ వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ చాలా సంవత్సరాల నుంచి నిర్మించిన బీటీ రోడ్డు గ్రామంలో వర్షపు నీరు నిలువ ఉన్న కారణంగా పూర్తిగా దెబ్బ తినడంతో మురికి నీరు చేరి మోకాటి లోతు నిల్వ ఉంటుందని గ్రామస్తులు ఉన్నతాధికారులకు సమస్యను విన్నవించుకున్నారన్నారు. స్పందించిన అధికారులు 170 మీటర్ల పొడవున సిసి రోడ్డు నిర్మాణం పనులు చేపట్టేందుకు నిధులు మంజూరు చేశారన్నారు. కాంట్రాక్టర్ పనులు మొదలు పెట్టారన్నారు. రోడ్డు నిర్మాణం పూర్తయితే గ్రామస్తులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని తెలిపారు.

సిసి రోడ్డు నిర్మాణ పనులు చేయిస్తున్న అధికారులు కాంట్రాక్టర్

సబ్సిడీపై దానామృతం : ఎడి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ : పశుసంవర్ధక శాఖ దానామృతం పథకం కింద 60 శాతం సబ్సిడీతో బలవర్ధకమైన పౌష్టిక ఆహారాన్ని అందిస్తున్నదని పశుసంవర్ధక శాఖ ఏడి గిడ్డయ్య పేర్కొన్నారు. మండల కేంద్రంలోని అర్‌బికేలో వ్యవసాయ అధికారి సుధాకర్ అధ్యక్షతన వ్యవసాయ సలహా మండలి సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భం గా ఏడి మాట్లాడుతూ 25 కేజీల దాణామృతం ప్యాకెట్లు 60 శాతం సబ్సిడీతో అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వ్యవసాయ అధికారి సుధాకర్ మాట్లాడుతూ ఆరుతడి పంటలు సాగు చేసుకోవా లని, వరి పైరు వేసి నష్టపోవద్దని సూచించారు. కార్యక్రమంలో శిరివేళ్ల, గోవిందపల్లి పశువైద్యాధికారులు దస్తగిరి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పేదలందరికీ ఇళ్ల స్థలాలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్ : అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలను, ఇళ్ల నిర్మాణాలను చేపట్టి వారి సొంతింటి కలలను నెరవేర్చేందుకు జగనన్న కాలనీలు, ఇళ్ల స్థలాలు, ఇళ్లను కేటాయించినట్లు ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిశోర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నంద్యాల మండలం పుసులూరు గ్రామానికి చెందిన ఐదుగురు పేదలకు ఎమ్మెల్యే స్థానిక కార్యాలయంలో ఇళ్ల పట్టాలను అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి రామసుబ్బయ్య, ఎంపిటిసి సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుండి ప్యాపిలి మార్కెట్లో టమోటా కొనుగోలు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్ : ప్రస్తుతం టమాట ధరలు తగ్గడంతో రైతులు నష్టపోకుండా మార్కెటింగ్ శాఖ నేడు శనివారం నుండి ప్యాపిలి మార్కెట్‌లో వేలంలో పాల్గొని టమాటాలు కొనుగోలు చేయనున్నట్లు జిల్లా వ్యవసాయ వాణిజ్య, మార్కెటింగ్ అధికారి ఎస్. అబ్దుల్ రహిమాన్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొనుగోలు చేసిన టమాటాలను రాష్ట్రంలోని రైతు బజారులకు సరఫరా చేయనున్నట్లు తెలిపారు.

పరీక్షలే జీవితం కాదు : డాక్టర్ సింధూజ

ప్రజాశక్తి - పాణ్యం : పరీక్షలే జీవితం కాదని, విద్యార్థులు మానసిక ఒత్తిడిని జయించాలని శాంతిరాం వైద్యశాల మానసిక వైద్యురాలు డాక్టర్ సింధూజ పేర్కొన్నారు. ఆత్మహత్య నివారణ దినోత్సవంలో భాగంగా శుక్రవారం స్థానిక ఇందిరానగర్‌లోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థినిలు పరీక్షల సమయంలో ఎలాంటి ఒత్తిడికి గురి కారాదన్నారు. పరీక్షల్లో ఫెయిల్ అయితే ఆత్మహత్యలు చేసుకోవడం నేరమన్నారు. ఆత్మహత్యల వలన సాధించేది ఏమీ ఉండదన్నారు. సమస్య పరిష్కారానికి మళ్లీ మళ్లీ ప్రయత్నించాలని కోరారు. కార్యక్రమంలో వైద్యులు ఎండి కలాం, విష్ణు ప్రియ, కిషోర్ కుమార్, ఇన్చార్జి ప్రిన్సిపల్ తిమ్మమ్మ, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు

పరిమితికి మించి ప్రయాణికులను తరలించరాదు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్ : ప్రమాదాల నివారణకు ప్రతి రోజు విజిబుల్ పోలీసింగ్‌లో ఆటోలలో, బైక్‌లపై, ఇతర వాహనాలపై పరిమితికి మించి ప్రయాణికులను చేరవేసిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ కె.రఘు వీర్ రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికే ఓవర్ లోడుతో ప్రయాణికులను చేరవేస్తున్న ఆటోలను సీజ్ చేసి ఎంవిఐకి అప్పగించినట్లు తెలిపారు.

చెంచు గిరిజనులు ఆర్థికాభివృద్ధి చెందాలి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ : చెంచు గిరిజనులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని గిరిజన వెల్ఫేర్ సంఘం సిబ్బంది మధుమోహన్, ఆవులమ్మ అన్నారు. అహోబిలం చెంచు గిరిజనులు జీవన విధానం, వారి ఆర్థిక స్థితిగతుల గురించి శుక్రవారం అహోబిలం పరిధిలోని కొత్త కొట్టాల, బండ్లగడ్డ చెంచుగూడెంలో వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మహబూబ్

ప్రజాశక్తి
www.prajasakti.com

ఈ క్రాప్ చేయించుకోవాలి

- వ్యవసాయ సలహా మండలి సమావేశాల్లో వక్తలు

సమావేశంలో మాట్లాడుతున్న కొండలరావు

ప్రజాశక్తి - ఆత్మకూరు

ప్రతి రైతు ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కొండలరావు సూచించారు. శుక్రవారం ఆత్మకూరు పట్టణంలోని స్థానిక అర్బన్ రైతు భరోసా కేంద్రం నందు వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ కొండలరావు మాట్లాడుతూ ప్రతి రైతు తప్పనిసరిగా పంట నమోదు చేసుకోవాలని, అలాగే ఆదరణ పంటలు వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి జి శంకర్ రెడ్డి, ఆత్మకూర్ అర్బన్ రైతు భరోసా చైర్మన్ భైరాపురం మహబూబ్ బాషా, వ్యవసాయ అనుబంధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

చాగలమర్రి : ప్రతి రైతు తప్పనిసరిగా ఈ నెల 15 తేదీలోపు సాగు చేసిన పంటలను ఈ క్రాప్ చేయించుకోవాలని ఆళ్లగడ్డ వ్యవసాయ సహాయ సంచాలకులు రామ్మోహన్ రెడ్డి కోరారు. చాగలమర్రి పట్టణంలోని 2వ రైతు భరోసా కేంద్రం నందు మండలస్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం ఆళ్లగడ్డ టెక్నికల్ ఎఒ నాగేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల ద్వారా అందిస్తున్న ఎరువులను సద్వినియోగం చేసుకోవాలని, ఎవరికైనా వారు నాటే విత్తనం, ఉపయోగించే ఎరువు నాణ్యత పరీక్షించుకోవాలనుకుంటే వారు ఆళ్లగడ్డలో ఉన్న నియోజకవర్గ అగ్రి ల్యాబ్ నందు ఉచితముగా పరీక్ష చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారి సాయి బాబ, రైతులు పాల్గొన్నారు.

రైతులకు సిబ్సిడీపై పనిముట్లు ఇవ్వాలి : చైర్మన్

వెలుగోడు : రైతులకు సిబ్సిడీపై పనిముట్లు ఇవ్వాలని మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్, సభ్యులు కోరారు. వెలుగోడు రైతు భరోసా కేంద్రం-3 నందు సెప్టెంబర్ మాసం మండల వ్యవసాయ సలహా మండలి సమావేశము ఆత్మకూరు ఏడి ఆంజనేయ ఆధ్వర్యంలో నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్, వెలుగోడు అసిస్టెంట్ సర్జన్ సుధాకర్ రెడ్డి, సెరికల్చర్ టెక్నికల్ అసిస్టెంట్ రాజశేఖర్, తెలుగు గంగ ప్రాజెక్టు టెక్నికల్ అసిస్టెంట్ పాశిల్, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్, సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆత్మకూరు ఏడి ఆంజనేయ మాట్లాడారు. అనంతరం మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్, సభ్యులు మాట్లాడుతూ మిరప రైతులకు సబ్సిడీపై లింగాకర్షణ బుట్టలు, తెలుపు, నీలం, పసుపు జిగురుఅట్టలు, రైతులకు వ్యక్తిగత ట్రాక్టర్లు వ్యవసాయ పనిముట్లు సబ్సిడీపై ఇవ్వాలని కోరారు. మండల వ్యవసాయాధికారి పవన్ కుమార్ మాట్లాడుతూ రైతుల సాగు చేస్తున్న పంటలను వెంటనే తమ వద్ద నమోదు చేసుకోవాలని కోరారు.

అందుబాటులో ఎరువులు ఉంచాలి : జడ్పిటిసి

కొత్తపల్లి : గ్రామాల్లో ఉన్న రైతులు ఖరీఫ్ సీజన్లో పలు పంటలు వేసిన ప్రతి రైతు తప్పనిసరిగా పంట నమోదు చేసుకోవాలని జడ్పిటిసి సోమల సుధాకర్ రెడ్డి, జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి హేమలత తెలిపారు. కొత్తపల్లిలో వ్యవసాయ కార్యాలయంలో మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం మండల వ్యవసాయ అధికారి మహేష్ ఆధ్వ ర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఎరువులు ఉంచాలని వ్యవసాయ అధికారులకు సూచిం చారు. పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ భువనేశ్వరి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులకు జీవామృతం, జిగురు అట్టలు, లింగాకర్షణ బుట్టలు కావలసినవారు రైతు భరోసా కేంద్రంలో సంప్రదిం చాలని తెలియజేశారు.

నందికొట్కూరు టౌన్ : పట్టణంలోని వ్యవసాయ కార్యాలయం నందు వ్యవసాయ సలహా మండల సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా నందికొట్కూరు మండల అధ్యక్షులు బి మురళీకృష్ణ రెడ్డి అధ్యక్షత వహించి మాట్లాడారు. ఖరీఫ్ సీజన్లో సరైన వర్షాలు లేనందున, రైతులు ఇబ్బంది లకు గురయ్యారన్నారు. రబీ సీజన్లో మాత్రం వ్యవసాయ అధికారుల సూచనలను పాటించి రైతులందరూ చిరుధాన్యాల పంటలకు ప్రాముఖ్యత ఇచ్చి వేసుకోవాలని సలహా ఇచ్చారు. రైతులందరూ ఈ క్రాప్ నమోదు చేసుకోవాలని, పంట నష్టం భీమా, రైతులందరికీ వర్తిస్తుందని సూచించారు. ఏవో, ఏడిఈ, తదితరులు పాల్గొన్నారు.

టిడిపిలోకి హైకోర్టు న్యాయవాది గోగిశెట్టి

చంద్రబాబు సమక్షంలో

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

టిడిపిలోకి చేరుతున్న గోగిశెట్టి

టిడిపి అధినేత, పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో హైకోర్టు అడ్వకేట్ డాక్టర్ గోగిశెట్టి నరసింహారావు, ఆయన కార్యకర్తలు అభిమానులు పెద్ద సంఖ్యలో పార్టీలోకి శుక్రవారం చేరారు. శిరివెళ్ల మండలం వీరారెడ్డి పల్లె గ్రామం నుండి మాజీ మంత్రి భూమా అఖిల ప్రియ, భార్గవ్ రామ్ దంపతులు, తాలూకా నాయకులు జగద్విఖ్యాత్ రెడ్డి ఆధ్వర్యంలో గోగిశెట్టి నరసింహారావు, ఆయన అభిమానులు, కార్యకర్తలు, మాజీ సర్పంచులు భారీ ఎత్తున వందలాది వాహనాలతో బనగానపల్లెకు వెళ్లి మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. పార్టీ విడుదల చేసిన మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. వైసిపి కుళ్లు రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. హైకోర్టు న్యాయవాది గోగి శెట్టి నరసింహారావు మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధిలో ముందుకు వెళ్లాలంటే రాబోయే ఎన్నికల్లో టిడిపి గెలిచి ముఖ్యమంత్రిగా చంద్రబాబు పగ్గాలు చేపట్టాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ పార్టీలో చేరామన్నారు.

లక్ష్య సాధనకై కృషి చేయాలి : ప్రిన్సిపల్

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

ముఖ్య అతిథులను సన్మానిస్తున్న ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ చంద్రసేనరెడ్డి

విద్యార్థులు జీవితంలో లక్ష్యం ఏర్పరుచుకుని సాధనకు కృషి చేయాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం కొలిమిగుండ్లలో ఏపి మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ చంద్ర సేనా రెడ్డి అధ్వర్యంలో ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ముఖ్య అతిథులుగా ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ బండారు శ్రీనివాసులు, ఎంఇఒ అబ్దుల్ కలాం, ఎస్ఐ రమేష్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ సీనియర్ విద్యార్థులు జూనియర్స్‌కు వెల్‌కమ్ చెప్పడం చాలా సంతోషమని, వారు చక్కగా ఉన్నతవిద్యనభ్యసించి తల్లిదండ్రుల కలల్ని సాకారం చేయాలన్నారు. అనంతరం ముఖ్య అతిథులను మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ రాముడు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లంచాలకు తావు లేకుండా సంక్షేమం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గడివేముల

లంచాలకు తావు లేకుండా సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం గడివేముల గ్రామ సచివాలయం పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించి లబ్ధిదారులకు బుక్ లేట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ఆర్.బీ చంద్రశేఖరరెడ్డి, ఎంపీపీ నాగమద్దమ్మ, తాసిల్దార్ శ్రీనివాసులు, ఎంపిడిఓ శివ మల్లేశ్వరప్ప,ఉప సర్పంచ్ బాలచెన్నీ, నాయకులు దేశం నాగేశ్వర రెడ్డి, రామకృష్ణారెడ్డి, రాం భూపాల్ రెడ్డి, వెంకటకృష్ణారెడ్డి, రమేష్, రవీంద్రారెడ్డి, సచివాలయం సిబ్బంది, వలంటీర్ లు పాల్గొన్నారు.

పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

ఐటి నోటీసులపై చంద్రబాబు స్పందించాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బనగానపల్లె

అమరావతి రాజధాని నిర్మాణ పనుల్లో జరిగిన అవినీతిపై మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఐటి శాఖ ఇచ్చిన నోటీసులపై స్పందించాలని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ఎమ్మెల్యే పట్టణంలోని తన నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. అమరావతి రాజధానిలో రూ. 600 కోట్ల పనుల్లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రూ.119 కోట్ల అవినీతికి పాల్పడినట్లు ఐటీ శాఖ నోటీసులు ఇచ్చిందన్నారు. ఈ నోటీసులపై మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అమరావతి నిర్మాణ పనులపై సిబిసిఐడి ఈడి శాఖ ద్వారా విచారణ చేయించి అందులో భాగస్వామ్యం ఉన్న వారిందరినీ కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో వైసిపి అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి, యాగంటి దేవస్థానం చైర్మన్ తోట బుచ్చిరెడ్డి, జిల్లా ప్రచార కార్యదర్శి సిద్ధం రెడ్డి రామ్మోహన్ రెడ్డి, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ సన్నల జనార్ధన్ రెడ్డి, నాయకులు అబ్దుల్ ఫైజ్, అత్తార్ జాహిద్ హుస్సేన్, ఖానిక్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న నాయకులు

చంద్రబాబుకు ఘన స్వాగతం

ప్రజాశక్తి - పాణ్యం

పాణ్యం మండలం ఆలమూరు, కొనిదేడు, పాణ్యం, బలపనూరు గ్రామాలలో దారి వెంట మాజీ ముఖ్యమంత్రి, టిడిపి జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడుకు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా స్వాగతం పలికారు. చంద్రబాబు విజయ సంకేతం చూపిస్తూ కార్యకర్తలని ఉత్తేజపరుస్తూ ముందుకు కదిలారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గౌరు వెంకటరెడ్డి, గౌరు చరిత, మండల నాయకులు మల్లు రామ గోవింద రెడ్డి, జయారామి రెడ్డి, లాయర్ బాబు, రమణ మూర్తి, రంగ రమేష్, ఇప్ప సుధాకర్, శుభా న్, దుబాయ్ శీను, రామ పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలి : డిఎస్‌పి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని డిఎస్పి వెంకటరామయ్య, సీఐ రమేష్ బాబులు అన్నారు. శుక్రవారం స్థానిక కెవి సుబ్బారెడ్డి డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఉమన్ డిగ్నిటీ, సోషల్ మీడియాపై అవగాహన సదస్సు శక్తి టీం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పి, సిఐలు మహిళలపై ప్రస్తుతం జరుగుతున్న లైంగిక దాడులు, సోషల్ మీడియాలో జరుగుతున్న దుష్ప్రచారంపై, పోక్సో, నిర్భయ చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సైబర్ క్రైమ్, బాల్య వివాహాలు , టీజింగ్, ర్యాగింగ్, మాదక ద్రవ్యాల వాడకం వలన కలిగే దుష్పరిణామాలపై వివరించారు. కార్యక్రమంలో పట్టణ ఎస్సై వెంకట్ రెడ్డి, శక్తి టీం ఇంచార్జ్ సుబ్బలక్ష్మి, నాగశేఖర్, నాగరాజు, కళాశాల వైస్ ప్రిన్సిపల్ భూమా శ్రీనివాసరెడ్డి, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో బిడ్డలకు ఆరోగ్యం

చిన్నారులతో ర్యాలీ నిర్వహిస్తున్న ఐసిడిఎస్ సూపర్వైజర్

ప్రజాశక్తి - కొత్తపల్లి

గ్రామాల్లో ఉన్న మహిళలందరూ పౌష్టికాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యవంతమైన బిడ్డలకు జన్మ ఇవ్వడంతో పాటు పౌష్టికాహారం వల్ల పుట్టబోయే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని ఐసిడిఎస్ సూపర్వైజర్ నాగేశ్వరమ్మ తెలిపారు. శుక్రవారం మండలంలోని బండి నాయిని పాలెం గ్రామంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పోషణ కార్యక్రమంపై చిన్నారులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న అంగన్వాడి సెంటర్ లో నుంచి వస్తున్న పౌష్టికాహారం గర్భవతులు తీసుకోవడం వల్ల తల్లి కడుపులో ఉన్నప్పటి నుంచి శిశువుకు ఆహారం తల్లి ద్వారా అందడం జరుగుతుందన్నారు. అంగన్వాడీ కేంద్రంలో ఇచ్చే వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ కిట్టు ద్వారా తల్లులకు పౌష్టికాహారం అంది వ్వడం జరుగుతుందన్నారు. 104 సిబ్బంది, స్కూల్ హెడ్మాస్టర్ రామకృష్ణ, ఆశ వర్కర్, మహేశ్వరమ్మ అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

చాగలమర్రి : గర్భిణీలు, బాలింతలు పోషక విలువలు ఉండే ఆహారం తీసుకోవాలని మండల ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ సూపర్వైజర్ సీతారాములమ్మ తెలిపారు. శుక్రవారం చాగలమర్రిలోని 17 అంగన్వాడి కేంద్రంలో టీచర్ చంద్రకళ, 12వ అంగ న్వాడి కేంద్రం టీచర్ ఇందుమతి, చాగలమ్మ చెంచుగూడెం మినీ అంగన్వాడీ టీచర్ కాకి సుజాత ఆధ్వర్యంలో పోషణ మాసోత్సవం నిర్వహి ంచారు. ఈ కార్యక్రమంలో జిఎంఎస్‌కె పర్వీన్, ఆరోగ్య కార్యకర్త మాధవి, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

స్థానిక నందికొట్కూరు పట్టణంలోని బసిరెడ్డి మెమోరియల్ డిగ్రీ కళాశాల నందు శుక్రవారం నాడు విద్యార్థినిలకు మహిళా చట్టాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ముఖ్యఅతిథిగా సర్కిల్ ఇన్స్పెక్టర్ ఓ విజయభాస్కర్ హాజరై మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో ప్రతి విద్యార్థినిలకు మహిళా చట్టాల పైన, సైబర్ నేరాల పైన అవగాహన ఉండాలని, విద్యార్థినులు తమ వ్యక్తిగత బ్యాంకింగ్ వివరాలు, ఓటిపి వంటి వివరాలను తెలియని వ్యక్తులతో పంచుకోరాదని, అలాగే అపరిచితులు పంపే మెసేజ్ లకు స్పందించకూడదని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ వి.ఎన్ సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సూది రెడ్డి రమేష్ రెడ్డి, మహిళా డైరెక్టర్ సరళ దేవి , మహిళా పోలీసు సిబ్బంది, మహిళ అధ్యాపకులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కల్పిస్తున్న సిఐ

విద్యార్థినీకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై అశోక్

పాములపాడు : విద్యార్థినిలు మహిళలకు ఉన్న చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని పాములపాడు ఎస్సై అశోక్ తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థినిలకు, మహిళలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చట్టాలపై అవగాహన కల్పించారు, కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, ఏఎస్ఐ యేసయ్య అధ్యాపకులు పాల్గొన్నారు.

శ్రీశైలంలో సామూహిక వరలక్ష్మీ వ్రతం

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రావణమాసం సందర్భంగా శ్రీశైలం దేవస్థానంలో శుక్రవారం నాడు వైభవంగా ఉచిత సామూహిక వరలక్ష్మి వ్రతములను నిర్వహించారు. ధర్మ ప్రచారం కార్యక్రమంలో భాగంగా నాలుగవ శుక్రవారం నాడు 600 మంది ముత్తైదులతో ఇందులో 450మంది చెంచు మహిళలు150 మంది ఇతర మహిళలు పాల్గొన్నారు. ఉత్తర ద్వారం ఎదురుగా ఉన్న చంద్రావతి కళ్యాణ మండపంలో సంప్రదాయబద్ధంగా వరలక్ష్మీ వ్రతమును నిర్వహించినట్లుగా దేవస్థానం అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముత్తైదువులకు అందరికీ స్వామి అమ్మవార్ల దర్శనం ఆ తర్వాత శేష వస్త్రాలను అన్నపూర్ణ భవనంలో అన్న ప్రసాదాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వెయ్యి మంది ముత్తైదువ మహిళలకు 600 కలశములను ఏర్పాటు చేసి వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. అనంతరం వీరికి శేష వస్త్రాలను ప్రసాదాలను అందజేసి వీటితో పాటు శ్రీశైల ప్రభ పుస్తకాన్ని అందించారు. పాల్గొన్న అందరికీ ప్రత్యేక క్యూ లైన్ ఏర్పాటు చేసి స్వామి అమలు దర్శనం కల్పించారు.

వ్రతంలో పాల్గొన్న మహిళలు

మాట్లాడుతున్న టిడిపి నాయకులు

చంద్రబాబు పర్యటన సక్సెస్ : టిడిపి

ప్రజాశక్తి -ప్యాపిలి

చంద్రబాబు నాయుడు పర్యటన ప్యాపిలిలో విజయవంతమైందని టిడిపి నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక టిడిపి కార్యాలయం లో టిడిపి నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు పర్యటన సక్సెస్ అయినందుకు ప్రతి తెలుగుదేశం కార్యకర్తలకు, నందమూరి కుటింబీకులకు ధన్యవాదాలు అన్నారు. మున్ముందు జరిగే టీడీపీ కార్యక్రమాలను విజయ వంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అంకిరెడ్డి, రామసుబ్బయ్య, రాంమోహన్, చిన్న సుంకయ్య,పెద్ద రామాంజి నేయులు,నాగేంద్ర,ఖాజా పీర్, చల్లా వీర,కొంగనపల్లె మధు, ధనం మధు, ఎస్ కె వలి, మౌలాలి రెడ్డి, రాము, వెంకటేశ్వరరెడ్డి,శ్రీనివాసులు, రామ చంద్రుడు, వెంకట్ రాముడు, బాలరంగన్న, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణ విగ్రహం ఊరేగింపు

ప్రజాశక్తి-డోన్

పల్లకిని మోస్తున్న చైర్మన్ సప్తశైల రాజేష్, సప్తశైలసుమిత్ర

డోన్ పట్టణంలోని త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రబోధానంద ఆశ్రమ నిర్వాహకులు ఆధ్వర్యంలో శ్రీ కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా శుక్రవారం ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు. డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, డాక్టర్ వైఎస్ఆర్ హార్టికల్చర్ యూనివర్సిటీ బోర్డు మెంబర్ సప్తశైలసుమిత్ర లు హాజరై పూజలు నిర్వహించారు. అనంతరం త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రబోధానంద ఆశ్రమ నిర్వాహకులు ఆధ్వర్యంలో ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిపై శ్రీకృష్ణుని ఉత్సవ విగ్రహం పాత బస్టాండ్ నుంచి నిర్వహించిన ఊరేగింపులో సప్తశైల రాజేష్, సప్తశైలసుమిత్రలు పల్లకిని మోసారు.

జగనన్న ఇంటి నిర్మాణాలపై సమీక్ష

ప్రజాశక్తి - పాములపాడు

మండలంలోని జగనన్న కాలనీలలో ఇంటి నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీవో గోపికృష్ణ కోరారు. శుక్రవారం హౌసింగ్, ఎన్ఆర్ ఈజీఎస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. జగనన్న కాలనీలలో వెల్కమ్ ఆర్చి లను, సోక్ ఫీడ్స్, ఎలక్ట్రికల్ మీటర్స్ తదితర వాటిని కంప్లీట్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచనలు చేశారు. ఇంటి నిర్మాణా లను పూర్తి చేసిన వారికి బిల్లులు పడేవిధంగా చూడాలన్నారు. కార్యక్రమ ంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మొక్కజొన్న రైతుకు నష్ట పరిహారం

రేంజ్ అధికారి త్రినాథ్ రెడ్డి

ప్రజాశక్తి - రుద్రవరం

మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఇన్చార్జి రేంజ్ అధికారి త్రినాథ్ రెడ్డి ఫారెస్ట్ సిబ్బంది

రుద్రవరం అటవీ సమీపంలోని పందిర్లపల్లె గ్రామంలో అడవి పందుల వల్ల మొక్కజొన్న పంట నష్టపోయిన రైతుకు నష్టపరిహారం ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని రుద్రవరం అటవీ రేంజ్ ఇంచార్జ్ రేంజ్ అధికారి త్రినాథ్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన సిబ్బందితో కలిసి పందిర్ల పల్లె గ్రామ సమీపంలో రైతు వెంకటేశ్వర్లు సాగు చేసిన మొక్కజొన్న పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవి పందులు మొక్కజొన్న పంట నష్టం కలిగించాయని రైతు ఇచ్చిన అర్జీ మేరకు పొలాన్ని పరిశీలించామన్నారు. పంటకు జరిగిన నష్టానికి అటవీశాఖ తరుపున నష్టపరిహారం ఇస్తామని హామీ ఇచ్చామన్నారు. అడవి జంతువులకు హాని తలపెట్ట వద్దని, పంట పొలాల్లో ఉచ్చులు, కరెంటు తీగలు పెట్ట వద్దని, అటవీ శాఖ అధికారులకి రైతులు సహకరించాలని సూచించారు. ఫారెస్ట్ సెక్షన్ అధికారి శ్రీనివాసులు రెడ్డి, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు సురేంద్ర గౌడ్, నరసింహారెడ్డి, చాణిక్యుడు, వ్యవసాయ శాఖ సహాయకులు, గ్రామ రైతు శివ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- జిల్లా మలేరియా అధికారి కామేశ్వరరావు

ప్రజాశక్తి - బేతంచెర్ల

మాట్లాడుతున్న జిల్లా మలేరియా అధికారి కామేశ్వరరావు

వ్యాధులు రాకుండా, ఇంటి పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకొని, దోమతెరలు వాడాలని నంద్యాల జిల్లా మలేరియా అధికారి కామేశ్వరరావు అన్నారు. శుక్రవారం నాడు బేతంచర్ల మండల పరిధిలోని సిమెంట్ నగర్ గ్రామంలో గల ఒకటి, రెండు సచివాలయాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మలేరియా అధికారి కామే శ్వరం మాట్లాడుతూ ఫ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని గురించి ప్రజలతో కలుసు కొని చర్చించి మాట్లాడారు. ప్రతి శుక్రవారం నీటి తొట్లను పరిశీలించి దోమలు వాటి గుడ్ల లార్వాలు విలువ ఉన్న నీళ్లను పారబోయించారు. దోమ తెరలు వాడమని,దోమకాటు నుండి ఎలా రక్షించుకోవాలో ప్రజాలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సహాయ మలేరియా అధికారి వరప్రసాదరెడ్డి, బేతంచెర్ల మలేరియా సబ్ యూనిట్ అధికారి వెంకటేశ్వర్లు, హెల్త్ అసిస్టెంట్ రామాంజనేయులు, శంకరాచారి, యంయల్‌హెచ్‌పిలు, తదితరులు పాల్గొన్నారు.

కళాతపస్వి డాక్టర్ గరికపాటి

- ప్రజా నాట్య మండలి

ప్రజాశక్తి - ఆత్మకూర్

డాక్టర్ రాజారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కళాకారులు

కళాతపస్వి గరికపాటి రాజారావు అని ప్రజా నాట్య మండలి జిల్లా అధ్యక్షులు డాలు వెంకటేశ్వర్లు, సీనియర్ గాయకులు కె. జోసప్ చంద్ర శేఖర్‌లు అన్నారు. శుక్రవారం పట్టణంలోని సుదర్శన వర్మ భవన్ నందు ప్రజానాట్యమండలి వ్యవస్థాపకులు, రచయిత, కళాకారుడు, వైద్యులు, గరికపాటి రాజారావు వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా నాట్యమండలి ఆధ్వర్యంలోఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాటక శిల్పం, నటనా శిల్పం ఉన్నతంగా ఉంచడానికి రాజారావు చేసిన కృషి మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో ఏ పి రైతు సంఘం మండల అధ్యక్షులు మాబాష, సి ఐ టి యు నాయకులు ఏ. రణధీర్, పట్టణ కార్యదర్శి డి. రామ్ నాయక్, ఏ పి భవన నిర్మాణ కార్మిక సంఘం పట్టణ కార్యదర్శి షైక్ ఇస్మాయిల్, నాయకులు గణపతి, రవి,వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు సమ సమాజ స్థాపకులు : జడ్పిటిసి

ప్రజాశక్తి - గడివేముల

ఉపాధ్యాయులు సమ సమాజ స్థాపకులు అని జడ్పిటిసి చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఎంఈఓ కార్యాలయంలో జరిగిన మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమంలో జడ్పిటిసి ఆర్‌బి చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్నత స్థాయిలో ఉన్నవారందరూ ఉపాధ్యాయుల చేత రూపు దిద్దుకున్న వారేనన్నారు. ఎంఈఓ విమల వసుంధర దేవి మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదన్నారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు జేసీ నరసింహులు, వెంకటసుబ్బయ్య, చంద్రశేఖర్ ఆచారి, పుల్లయ్య, ఒబయ్యా పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఇన్‌ఛార్జ్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య

పిఎం కిసాన్ దరఖాస్తుల పరిశీలన

- హోళగుంద తహశీల్దార్‌కు మెమో జారీ
- ఇన్‌ఛార్జి కలెక్టర్ నారపురెడ్డి మౌర్య

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

పిఎం కిసాన్ సంబంధించిన దరఖాస్తుల పరిశీలన త్వరగా పూర్తిచేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ నారపురెడ్డి మౌర్య ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి ఇన్‌ఛార్జి కలెక్టర్ నారపురెడ్డి మౌర్య సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. సర్వేకు సంబంధించి పెండింగ్ లో ఉన్న గ్రామాల్లో జరుగుతున్న గ్రౌండ్ ట్రూతింగ్, గ్రౌండ్ వ్యాలిడేషన్ పనులు నిర్దేశించిన గడువు లోపు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాన్నారు. పిఎం కిసాన్ కి సంబంధించి గోనెగండ్ల, చిప్పగిరి, ఆదోని, ఆలూరు, ఆస్పరి, దేవనకొండ, హోళగుంద, కోడుమూరు, కృష్ణగిరి, మద్దికెర, వెల్దుర్తి మండలాల్లో ఆన్‌లైన్ పోర్టల్ లో వ్యవసాయ శాఖ అధికారులు వారి లాగిన్‌లో సంబంధిత దరఖాస్తులున్నాయని అన్నారు. అనర్హులు కింద పెట్టిన వాటిలో ఎక్కడ కూడా తప్పిదాలు లేవు కదా, ఒకసారి మరల వెరిఫై చేసి సంబంధిత అధికారులు సంతకం పెట్టి నివేదికలు సాయంత్రం లోపు పంపాలని అదేశించారు. పెండింగ్ లో ఉన్న ఆధార్ సీడింగ్, మ్యూటేషన్ పనులు కూడా సంబంధిత తహశీల్దార్ లు పూర్తి చేయాలని అన్నారు. గత మూడు సమావేశాల నుండి ఆధార్ సీడింగ్‌కు సంబంధించిన నివేదికలు వ్యవసాయ శాఖ వారి నుండి తెప్పించుకొని పూర్తి చేయమని చెప్పినప్పటికీ కూడా హోళగుంద తహశీల్దార్‌కు మెమో ఇవ్వాలని డిఆర్ఓని అదేశించారు. ఈ క్రాప్ బుకింగ్ 100 శాతం పురోగతి సాధించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రీ సర్వేకు సంబంధించి ఫేస్ 3 కింద చేపడుతున్న రీ సర్వే కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామంలో గ్రౌండ్ ట్రూతింగ్ పనులు మొదలు అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రౌండ్ ట్రూతింగ్ అయిపోగానే వెంటనే ఎల్‌పిఎంలు జెనరేట్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. సెప్టెంబర్ 15 నాటికి స్టోన్ ప్లాంటేషన్ పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సంవత్సరం జిల్లా అసైన్మెంట్ రివ్యూ కమిటీ కొత్తగా గుర్తించిన అర్హులైన లబ్ధిదారుల యొక్క వివరాలను కూడా ఆన్‌లైన్‌లో ఎక్కించే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. కర్నూలు, ఆదోనిలో లీగల్ మెట్రాలజీ శాఖ వారికి స్థలాలు గుర్తించాలని సంబంధిత అధికారులకు సూచించారు. డిఆర్ఓ నాగేశ్వర రావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు మనోజ్ రెడ్డి, రమణకాంత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ బదిలీలు

- 150 మంది ఉపాధ్యాయులకు బదిలీ ఉత్తర్వులు
- చక్రం తిప్పిన అధికార పార్టీ ఎమ్మెల్యేలు
- మండిపడుతున్న ఉపాధ్యాయ సంఘాలు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ఉపాధ్యాయుల అక్రమ బదిలీలకు రాష్ట్ర ప్రభుత్వం మరోసారి తెరలేపింది. అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు చేసిన సిఫార్సులకు బదిలీ ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వం నేరుగా జారీ చేసింది. అక్రమ బదిలీలపై ఉపాధ్యాయ సంఘాలు ప్రభుత్వ తీరును ఖండిస్తూ మండిపడుతున్నాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఇటీవల కాలంలో 150 మందికి పైగా పాఠశాల ఉపాధ్యాయుల అక్రమ బదిలీ ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వం నేరుగా ఉత్తర్వులు జారీ చేసింది. ఉపాధ్యాయుల అక్రమ బదిలీల వ్యవహారంలో అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు మంత్రులు క్రియాశీలకంగా వ్యవహరించారు. ఒక్కో బదిలీ నిర్వహణకు ఏకంగా రూ.మూడు నుంచి రూ.ఐదు లక్షలకు పైగా అధికార పార్టీ ఎమ్మెల్యేలు వసూలు చేసినట్లు సమాచారం. ఈ వ్యవహారంలో ఎమ్మెల్యే నుండి విద్యాశాఖ మంత్రి వరకు కొనసాగినట్లు చర్చ కొనసాగుతుంది. ఉపాధ్యాయుల అక్రమ బదిలీ ఉత్తర్వులు నేరుగా జిల్లా విద్యాశాఖ అధికారికి పంపుతున్నారు. ఉపాధ్యాయుల బదిలీ స్థానాలను ఇవ్వకుండా నేరుగా ఆయా మండలాలకు పోస్టింగ్ ఇవ్వాలంటూ విద్యాశాఖ ఉన్నతాధికారులు జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంటున్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం , విద్యాశాఖ మంత్రి కార్యాలయం అక్రమ



బదిలీ సిఫార్సులు రాష్ట్ర విద్యాశాఖ ఉన్నతాధికారులకు చేరుతున్నాయి. ఆ సిఫార్సులకు రాష్ట్ర విద్యాశాఖ ఉన్నతాధికారులు ఆమోదముద్ర వేస్తూ బదిలీ ఉత్తర్వులను జారీ చేస్తున్నారు. ఈ ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభంలో ఉపాధ్యాయుల బదిలీలను జరిగాయి. అందులో జిల్లా , మండల కేంద్రాల్లో ఉన్నటువంటి స్థానాలను బ్లాక్ చేసి మిగిలిన స్థానాలను బదిలీలకు అవకాశం కల్పించారు. ఇప్పుడు బ్లాక్ చేసిన స్థానాలకు అక్రమ బదిలీల ద్వారా వస్తున్న ఉపాధ్యాయులకు ఉత్తర్వులను ఇస్తున్నారు. ఈ బదిలీల్లో పెద్ద ఎత్తున అవినీతి అక్రమాలు చోటు చేసుకుంటున్నాయని ఉపాధ్యాయ సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఉపాధ్యాయ బదిలీలను కౌన్సిలింగ్ ద్వారా నిర్వహించాలని ఆ సంఘాలు పోరాడి సాధించుకున్నాయి. కౌన్సిలింగ్ ద్వారానే బదిలీలను నిర్వహించాలని ఉన్నప్పటికీ విద్యాశాఖ ఉన్నతాధికారులు తుంగలో తొక్కుతున్నారు. అక్రమ బదిలీల ఉత్తర్వులను వెంటనే విరమించుకోవాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేశాయి.

సానుభూతి కోసమే బాబు ఎత్తుగడ

- ఐటి నోటీసులపై వైసిపి నాయకుల వ్యాఖ్య

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ఐటి శాఖ నోటీసుల విషయంలో చంద్రబాబు తనకు ప్రజల్లో సానుభూతిని సంపాదించుకోవడం కోసమే తనను అధికార పార్టీ తప్పకుండా జైలుకు పంపడం ఖాయమంటూ వ్యాఖ్యలు చేస్తున్నారని ఇది కేవలం తన రాజకీయ ఎత్తుగడని వైసిపి కర్నూలు, నంద్యాల జిల్లా అధ్యక్షులు బివై.రామయ్య, కాటసాని రాంభూపాల్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎస్‌వి. మోహన్ రెడ్డి అన్నారు. శుక్రవారం కర్నూలు వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.... ఇటీవల నిర్వహిస్తున్న పలు రాజకీయ సర్వేల్లో వైసిపికి అనుకూలంగా ఫలితాలు వస్తున్నాయని, దీన్ని జీర్ణించుకోలేక చంద్రబాబు నాయుడు నానా అవస్థలు పడుతున్నారన్నారు. అందులో భాగంగానే ఎక్కడికి వెళితే అక్కడ ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా రెచ్చగొట్టే మాటలు తన ప్రసంగాల్లో ఉన్నాయన్నారు. చివరికి ఐటి శాఖ చేతికి చిక్కడంతో రూ. 118 కోట్ల వివిధ కంపెనీల ద్వారా లంచంగా తీసుకుని పట్టుబడ్డారన్నారు. ఇదివరకే హైదరాబాదులో ఓటుకు నోటు కేసులో పట్టుబడి కరకట్టకు చేరారని ఎద్దేవా చేశారు. ఇప్పుడు ఐటి నోటీసులతో ఎక్కడికెళ్లి దాక్కోవాలో తెలియడం లేదన్నారు. చేసిన తప్పును కప్పించుకునేలా ప్రజల సానుభూతిని పొందేందుకు తనను అధికార పార్టీ జైలుకు పంపించనుందని ఎత్తుగడలు వేస్తున్నారని విమర్శించారు. తప్పులు చేసిన వారికి శిక్ష తప్పదని వారు అన్నారు. ఈ సమావేశంలో వైసిపి మహిళా విభాగం జోనల్ గాజుల శ్వేతరెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బెల్లం మహేశ్వర రెడ్డి, రాష్ట్ర వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.గోపాల్ రెడ్డి, యువజన విభాగం రాష్ట్ర విభాగం ప్రధాన కార్యదర్శి అక్కిమి హనుమంత్ రెడ్డి, నాయకులు సిహెచ్.మద్దయ్య, యూనూస్ బాషా, సందేపోగుశివ, దేవపూజ ధనుంజయ ఆచారి, చంద్రిక, బత్తుల లక్ష్మికాంతయ్య, సత్యం, రాజశేఖర్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వైసిపి జిల్లా అధ్యక్షులు, మేయర్ రామయ్య

ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

- కోర్టు ఆవరణలో భద్రత ఏర్పాట్లను పరిశీలించిన ఎస్‌పి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు జెఎఫ్‌ఎంసి (జుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు) కోర్టు ఆవరణలో భద్రత ఏర్పాట్లను జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్.శ్రీనివాస రావు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సిహెచ్.వెంకట నాగ శ్రీనివాస రావు, జిల్లా ఎస్‌పి జి. కృష్ణకాంత్ సంయుక్తంగా శుక్రవారం సాయంత్రం జిల్లా కోర్టు, ఎఎఫ్‌ఎంసి కోర్టు కాంప్లెక్సు పరిసరాలలో భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. ఏర్పాట్ల పరిశీలనలో భాగంగా జిల్లా కేంద్రంలోని కోర్టులతో పాటు, జిల్లాలోని అన్ని కోర్టు ఆవరణల్లో సిసి కెమెరాల ఏర్పాటు, పర్మనెంట్ సెక్యూరిటి యూనిట్స్ , సెక్యూరిటి రూమ్స్, గస్తీ , ప్రవేశ , నిష్క్రమణ గేట్ లు, పార్కింగ్ ప్రదేశాల ఏర్పాటు గురించి ఆరా తీశారు. ఇతర సౌకర్యాల గురించి చర్చించారు. ఈ అంశాల పై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ మెజిస్ట్రేట్ పఠాన్ షియాజ్ ఖాన్, స్పెషల్ బ్రాంచ్ సిఐ ప్రసాద్, కోర్టుమానిటరింగ్ సిఐ రామయ్యానాయుడు, కర్నూలు టు టౌన్ సిఐ శ్రీనివాసులు, ఎఆర్ ఆర్ ఐ రమణ, ఎస్‌ఐ ఖాజావలి, సిబ్బంది ఉన్నారు.

ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

నేడు కర్నూలుకు చంద్రబాబు రాక

బహిరంగ సభ స్థలాన్ని పరిశీలించిన గౌరు దంపతులు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కల్లూరు చెన్నమ్మ సర్కిల్‌లో శనివారం జరుగబోయే నారా చంద్రబాబు నాయుడు బహిరంగ సభ ప్రాంగణాన్ని పాణ్యం మాజీ ఎమ్మెల్యే టిడిపి ఇంచార్జి గౌరు చరిత, టిడిపి సీనియర్ నాయకులు గౌరు వెంకట రెడ్డి పరిశీలించారు. శుక్రవారం నంద్యాల జిల్లాలో పర్యటిస్తున్న చంద్రబాబునాయుడు శనివారం సాయంత్రం కర్నూలుకు రానున్నారు. బహిరంసభ అనంతరం ఆయన హైదరాబాద్‌కు వెళ్లారు. ఈ కార్యక్రమంలో నంద్యాల పార్లమెంటు మహిళా అధ్యక్షురాలు కె.పార్వతమ్మ, కర్నూలు పార్లమెంటు మహిళా అధ్యక్షురాలు ముంతాజ్ బేగం, మాదేష్, సింగిల్ విండో మాజీ ప్రెసిడెంట్ ఎన్‌వి.రామకృష్ణ, కల్లూరు అర్బన్ నాయకులు కాసాని మహేష్ గౌడ్, మాదేష్ , అలిపిర, పవన్, రవి ప్రకాశ్ రెడ్డి, బషీర్, మౌలాలి, టిడిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

చెన్నమ్మ సర్కిల్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న గౌరు చరితారెడ్డి, వెంకటరెడ్డి

కళలతో ప్రజలను చైతన్య పరచాలి

సభలో మాట్లాడుతున్న జంధ్యాల రఘుబాబు

- గరికపాటి పాటి రాజారావు వర్ధంతి సభలో వక్తలు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై కళారూపాల ద్వారా ప్రజలను చైతన్యం చేయాలని సాహితీ స్రవంతి రాష్ట్ర నాయకులు జంధ్యాల రఘుబాబు సూచించారు. శుక్రవారం కర్నూలు నగరంలోని పాత బస్తీ లోని గడియారం హాస్పిటల్ ఎదురుగా ఉన్న కార్యాలయంలో ప్రజానాట్యమండలి వ్యవస్థాపకులు డాక్టర్ గరికపాటి రాజారావు 60వ వర్ధంతి సభ డి.పార్వతయ్య అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. జంధ్యాల రఘుబాబు , సిపిఎం నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి రాజు ప్రసంగించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం, కళలను పట్టించుకోవడంలేదన్నారు. సాంస్కృతిక కళారూపాలను నిర్వహిస్తున్న ,కళాకారులను గుర్తించడం లేదన్నారు. కళాకారులకు అందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కళాకారులను ప్రోత్సహించాల్సిన ప్రభుత్వాలు, వారి పట్ల నిర్లక్ష్యంగా ఉన్నాయని అన్నారు. కళ కల కోసం కాదని, కళ ప్రజల కోసం కళ ప్రగతి కోసమని గరికపాటి రాజారావు వర్ధంతి సందర్భంగా తెలియజేశారు. గరికపాటి రాజారావు స్వతహాగా దర్శకుడు ,నిర్మాత ,నటులు అని వారు కొనియాడారు. పుట్టినిల్లు అనే సినిమా తీసి, దివాళా అయినా డాక్టర్ గరికపాటి రాజారావు, వేరేవాళ్ళ బయటి నుండి ఆర్థిక సహాయం చేస్తే తప్ప, బతకడం తప్ప వేరే మార్గం లేని పరిస్థితులలో ఉన్నప్పటికీ ఆ సినిమా ద్వారా హాస్య బ్రహ్మ అల్లూరి రామలింగయ్యను, పేరు ప్రఖ్యాతలు గాంచిన జమునను డాక్టర్ గరికపాటి రాజారావు తన పుట్టినిల్లు సినిమా ద్వారా సినిమా ఇండస్ట్రీకి పరిచయం చేశారని గుర్తు చేశారు. గరికపాటి రాజారావు వేదన, శోధన ,సాధన ,ప్రదర్శన అనే గుణాలను అలమరుచుకున్నారని వివరించారు. ప్రజా నాట్య మండలి రాష్ట్ర వ్యవస్థాపకులు కూడా అని అన్నారు. అనంతరం పిఎన్‌ఎమ్ బాధ్యులు మొహమ్మద్ షరీఫ్, ప్రజా నాట్యమండలి జిల్లా నాయకులు లోకేష్ మాట్లాడుతూ నేడు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, ప్రజలకు సంబంధించిన సమస్యల పైన చర్చ కాకుండా, కులం, మతం, ప్రాంతీయ విభేదాలు సృష్టించి హిందూ, ముస్లింల మధ్య, హిందూ, దళితుల మధ్య తగాదాలు పెడుతుందన్నారు. కళాకారులుగా బిజెపి ప్రభుత్వ విధానాలను ఎండగట్టి, కళారూపాల ద్వారా ప్రజలను, చైతన్యం చేయాల్సిన బాధ్యత ప్రజానాట్యమడలి ,కళాకారుల పైన ఉందన్నారు. ప్రజానాట్యమండలి నినాదం ఏదైతే ఉందో కళ కళ కోసం కాదు, కళ ప్రజల కోసం అనే దాన్ని మనం నిరూపించుకోవాల్సిన అవసరం ఇప్పుడు వచ్చిందన్నారు. సిఐటియు నగర అధ్యక్ష ,కార్యదర్శులు డి.అబ్దుల్ దేశాయ్, విజయ్ ప్రజానాట్యమండలి నగర కార్యదర్శిబి రాంబాబు ,బాలు,బతుకన్న,సరిత, లక్ష్మి, బజారి,వేణు ,దామోదర్, బాబు, శాలిబాష ,గణేష్, అన్వర్ ,సాదిక్, రామకృష్ణ, లక్ష్మన్న, ఆనంద్ పాల్గొన్నారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి

డిఐఒ డాక్టర్ ప్రవీణ్ కుమార్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

పారిశుధ్య పనుల కోసం ప్రభుత్వం విడుదల చేసిన నిధులను ఖర్చు చేసి గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్ అన్నారు. శుక్రవారం కల్లూరు మండలం సల్కాపురం గ్రామంలో విహెచ్ఎస్ఎన్‌సి కమిటీ సమావేశం నిర్వహించారు. డాక్టర్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ఆరోగ్య కార్యక్రమాలు, ప్రభుత్వ ఆరోగ్య పథకాల గురించి ప్రజలకు తెలియచేయడంలో విహెచ్ఎస్ఎన్‌సి కమిటీ సభ్యుల పాత్ర చాలా ముఖ్యమైనదని తెలిపారు. ప్రభుత్వం ప్రతి గ్రామపంచాయతికి రూ.10,000 చొప్పున నిధులు విడుదల చేసిందని వాటిని గ్రామంలో పారిశుధ్య పనులకు ఉపయోగించి ప్రజలు ఆరోగ్యకరమైన వాతావరణంలో ఉండేలా చూడాలని తెలిపారు. మిషన్ ఇంద్రధనుష్ కార్యక్రమంలో భాగంగా గర్భిణీ, పిల్లలకు సమయాను సారంగా ఇవ్వవలసిన టీకాలు ఏదేనీ కారణం వలన ఇవ్వనట్లయితే (లెఫ్ట్ అవుట్, డ్రాప్ అవుట్) సెప్టెంబర్ 11 వ తేది నుండి 16 వ తేది వరకు నిర్వహించే రెండవ విడత కార్యక్రమంలో 0-5 సం పిల్లలకు ముఖ్యగా గర్భిణీలకు టీకాలను వేయి ంచి ఆ వివరాలను యువిన్ పోర్టల్‌లో అప్లోడ్ చేయాలని ఆరోగ్య కార్య కర్తలను ఆదేశించారు. రెండవ విడత మిషన్ ఇంద్రధనుష్ కార్యక్రమానికి సంబం ధిం చిన బ్యానర్ ను ఆవిష్కరించారు. యుపిహెచ్‌సి ఇందిరమ్మ, హుసేస్ ను తనిఖీ చేసి మందులకు, వాక్సిన్లకు సంబందించిన రికార్డ్స్, రిపోర్ట్స్‌ను పరి శీలించారు.

కోట్లకు ఘనసన్మానం

ప్రజాశక్తి-గూడూరు

కోట్లను గజమాలతో సన్మానిస్తున్న దృశ్యం

గూడూరు నగర పంచాయతీలో తెలుగు వీధిలో శ్రీ చౌడేశ్వరి దేవి శివాలయం పునర్నిర్మాణంలో భాగంలో శుక్రవారం విగ్రహ ప్రతిష్ట ధ్వజస్తంభ ప్రతిష్ఠలో మాజీ కేంద్రమంత్రి కోట్ల జయసుర్య ప్రకాశ్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు తెలుగు సంఘం నాయకులు టి.మద్దిలేటి శ్రీనివాసులు, రామాంజనేయులు, జమ్మన్న , హనుమప్ప ఘన స్వాగతం పలికి మేళ తాళాలతో ఊరేగింపుగా దేవాలయం వరకు తీసుకెళ్లి ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం జయసుర్య ప్రకాష్ రెడ్డికి శాలువా గజమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట కర్నూలు పార్లమెంటు తెలుగు యువత కార్యదర్శి చరణ్ కుమార్, మాజీ కెడిసిసి డైరెక్టర్ రాజారెడ్డి, మాజీ నీటి సంఘం అధ్యక్షులు చెట్కింది మదిలేటి, మాజీ కెడిసిసి డైరెక్టర్ ఆకుపోగు చిన్న బతుకన్న, అయ్యావారి నాయుడు, వాల్మీకి సంఘం అధ్యక్షులు మదిలేటి, ఉపాధ్యక్షులు సంఘాల మధు, ఉప్పరి లక్ష్మన్న, రేవుల గోవిందు, తెలుగు యువత ఉపాధ్యక్షులు వై.నాగరాజు, వసంత ,పెద్ద రంగడు , చెట్టు కింద నారాయణ, పాముల పెద్దరాయుడు, బెలగల రామచంద్రుడు, నాగరాజు తదితరులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు,.

హమాలీల సంక్షేమానికి సమగ్ర చట్టం కావాలి : సిఐటియు

ఎమ్మెల్యే కాటసానికి సిఐటియు వినతి

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

ఎమ్మెల్యే కాటసానికి వినతిపత్రం ఇస్తున్న సిఐటియు నాయకులు

హమాలీ, జట్టు, ముఠా, కళాసి తదితర పేర్లతో రాష్ట్ర వ్యాప్తంగా పని చేస్తున్న హమాలీ కార్మికుల సంక్షేమానికి సమగ్ర చట్టం తీసుకురావాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్ రాధాకృష్ణ, నగర కార్యదర్శి సిహెచ్ సాయిబాబా డిమాండ్ చేశారు. హమాలీ కార్మికుల రాష్ట్ర ఫెడరేషన్ పిలుపులో భాగంగా హమాలీ, జట్టు, ముఠా, కళాసి, కార్మికులకు సమగ్ర చట్టం, వెల్ఫేర్ బోర్డు, సంక్షేమనిధి ఏర్పాటు చేయాలని కోరుతూ కర్నూలు హమాలీ ఫెడరేషన్ న్యూ సిటీ కమిటీ ఆధ్వర్యంలో పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 50 సంవత్సరాలు దాటి పని చేయలేక అనారోగ్యం బారిన పడిన కార్మికులకు నెలకు రూ.10 వేల పెన్షన్ ఇవ్వాలన్నారు. ప్రమాదానికి గురై వికలాంగుడిగా మారిన కార్మికుడికి రూ. 5 లక్షలు, ప్రమాదంలో మరణించిన కార్మికని కుటుంబానికి 10 లక్షల రూపాయలు ఆర్థిక సహాయం ప్రభుత్వం అందించి కార్మికులను ఆదుకోవాలన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్జీని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి శాసనసభలో మాట్లాడి హమాలీ కార్మికులకు సమగ్ర చట్టం చేయుటకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ, నగర అధ్యక్షులు ఆర్. నరసింహులు, మార్కెట్ యార్డ్ గౌరవ అధ్యక్షులు టి.రాముడు, హమాలీ ఫెడరేషన్ జిల్లా కన్వీనర్ ఎం.వెంకటేశ్వర్లు, హమాలీ ఫెడరేషన్ న్యూ సిటీ కన్వీనర్ ఆర్.ఓబులేసు, కో కన్వీనర్ బికె.రామకృష్ణ, నాయకులు విజయుడు, కే గోవిందు, ఎర్రమల, వెంకటస్వామి, పి మధు, షేక్షావలి, మునన్న, బీసన్న, వలి, మద్దిలేటి, లక్ష్మన్న, ఎం.జమ్మన్న హమాలీ కార్మికులు పాల్గొన్నారు.

ఉత్తమ అధ్యాపక అవార్డు గ్రహీతలకు సన్మానం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపక అవార్డు గ్రహీత డాక్టర్ అఖ్తర్‌బాను, డాక్టర్ ఫామిదా బేగం, ఇంద్రావతిలను ప్రజాశక్తి ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. సిల్వర్ జూబ్లీ కళాశాల , ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో జరిగిన సన్మాన కార్యక్రమంలో జనరల్ మేనేజర్ నరసింహ, డివిజన కోఆర్డినేటర్ ఎల్లా గువ్వెర, కళాశాల ప్రిన్సిపల్స్ డాక్టర్ వివి.సుబ్రహ్మణ్య కుమార్, హేమంత్ కుమార్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన అభినందన సభలో నరసింహ మాట్లాడుతూ జిల్లాలో ఉన్నత విద్యారంగా అభివృద్ధికి పాలక ప్రభుత్వాలు పాటుపడాలన్నారు. ఇక్కడున్న ఉన్నత విద్యా సంస్థలకు తగిన నిధులను కేటాయించి బలోపేతం చేయాలని కోరారు. ఉత్తమ అధ్యాపక అవార్డు గ్రహీతలకు అభినందనలు తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్స్ మాట్లాడుతూ ప్రతి ఏడాది ఉత్తమ అధ్యాపక అవార్డులు పొందిన వారిని ప్రజాశక్తి సన్మానించడం అభినందనీయమన్నారు. అనంతరం అవార్డు గ్రహీతలకు మెమొంటో శాలువాలతో ఘనంగా సన్మానించారు.

దాడిచేసిన ఎబివిపి నాయకులను అరెస్ట్ చేయాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

నిరసన తెలపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

తెలంగాణ రాష్ట్రంలో సంగారెడ్డి జిల్లాలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమేష్ పైన దాడిని వ్యతిరేకిస్తూ శుక్రవారం కర్నూలు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సుందరయ్య జంక్షన్‌లో నిరసన కార్యక్రమం ఈ కార్యక్రమానికి సిటీ కార్యదర్శి సాయి ఉదయ్ అధ్యక్షతన నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా మాట్లాడుతూ దేశంలో రోజురోజుకు ఎబివిపి విద్యార్థి సంఘ నాయకుల దాడులు పెరిగిపోతున్నాయని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్లీనరీ సమావేశాల భాగంగా ఈనెల 8 నుండి 10వ తేది వరకు జరుగుతున్నా ప్లీనరీ సమావేశాలు సందర్భంగా సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని నిన్న అర్ధ రాత్రి వేళ ఎస్ఎఫ్ఐ జెండాలు, తోరణాలతో ముస్తాబు చేస్తున్నా నాయకులను ఏబీవీపీ విద్యార్థి సంఘ నాయకులు దాడిచేసి తీవ్రంగా గాయపరిచారాని ఆ దాడిలో సంగారెడ్డి జిల్లా కార్యదర్శి రమేష్‌కు తలకు బలమైన గాయం కావడం , ఇతర నాయకులకు స్వల్ప గాయాలయ్యాయన్నారు. దీనిని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తుందని, ఎబివిపి గుండాలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడకుండా వాళ్లకు వత్తాసు పలికే విధంగా ఉన్నాయన్నారు. ప్రజాస్వామ్య దేశంలో ఈ రకమైన దాడులను మేధావులు విద్యావేత్తలు ప్రజాసంఘాల నాయకులు ఖండించాలన్నారు. ఈదాడికి పాల్పడిన ఏబీవీపీ విద్యార్థి సంఘ నాయకులను అరెస్టు చేసి తక్షణమే రిమాండ్ కు పంపించాలన్నారు. ఎబివిపి విద్యార్థి సంఘాన్ని దేశంలో లేకుండా బ్యాన్ చేయాలని డిమాండ్ చేశారు. నగర అధ్యక్షుడు అమర్ , ఉపాధ్యక్షుడు మల్లేష్, నాయకులు రాజు, మహేంద్ర ,మాధవస్వామి, విజయ్, కిరణ్ పాల్గొన్నారు.

రవీంద్ర విద్యార్థినులకు పథకాలు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రవీంద్ర బాలికల పాఠశాలలోని అమ్మాయిలకు 11వ నేషనల్ కరాటే పోటీలలో పథకాలు లభించాయి. అండర్ 14 విభాగంలో ఆవుల కావ్య ' కట' , 'కుమిటి' విభాగాలలో ద్వితీయ స్థానం పొంది రెండు రజత పథకాలు సాధించింది ఆవుల మేఘన అనే బాలిక కట విభాగంలో తతీయ స్థానం సాధించి కాంస్య పథకాన్ని సొంతం చేసుకుంది. పాఠశాలలో అభినందన సభను ఏర్పాటు చేశారు. ఈ అభినందన సభలో రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి. పుల్లయ్య విద్యార్థులను అభినందిస్తూ నేడు ఆడపిల్లలకు భద్రత తగ్గిపోతుంది. ఈ ఇలాంటి ఈ రోజుల్లో ఆడపిల్లలు కూడా స్వీయ రక్షణ కొరకు కరాటే, కర్రస్వాము లాంటి విద్యలు నేర్చుకొని తమను తాము సంరక్షించుకోవాలన్నారు. ఛైర్మన్ జివిఎం.మోహన్ కుమార్, వైస్ ఛైర్మన్ జి.వంశీధర్‌లు వారిని అభినందించారు. పాఠశాల సమన్వయకర్త హేమలత, వ్యాయామ ఉపాధ్యాయుడు నాగన్న పాల్గొన్నారు.

విద్యుద్ఘాంతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి- సి బెళగల్

పోలకల్ గ్రామంలో వీరన్న (23) విద్యుత్ ప్రమాదానికి గురై ప్రాణాలు విడిచిన సంఘటన శుక్రవారం చోటుచేసుకొంది. వీరన్న మేక పిల్లకు మేతకోసం ఇంటి సమీపంలో రావిచెట్టు ఎక్కి ఆకులు కోస్తుండగా చేతిలోని కొడవలి కొమ్మల మధ్యనున్న విద్యుత్ వైర్లను తాకాయి. క్షణాల్లో షాక్‌కు గురై అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. మృతుడికీ చిన్న వయసులోనే తండ్రి మృతి చెందగా తల్లి కొండమ్మ ఇద్దరు కొడుకులను, ముగ్గురు కూతుళ్ళను పెద్ద చేసి పెళ్లిళ్ల చేసింది. చిన్న కుమారుడికీ సంబంధం చూస్తున్న వేళ పెద్ద కుమారుడు వీరన్న మృతి, ఇరవైరోజుల గర్భిణీతో కోడలు, పసిపాపను చూసి కొండమ్మ, కుటుంబీకులు, బంధువులు రోదిస్తున్న తీరు చూపరులను కలచివేసింది. ఎస్ఐ పీరయ్య దర్యాప్తు చేపట్టి మృతదేహాన్ని పోస్టుమార్టం చేయించి విద్యుత్ శాఖనుండి అన్నీ విధాలుగా ఆదుకొనేందుకు చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు

కౌలు రైతులు సొసైటీ ద్వారా రుణాలు : ఎఒ

ప్రజాశక్తి-సి బెళగల్

మాట్లాడుతున్న ఎఒ మల్లేష్

కౌలు రైతులు సొసైటీ ద్వారా రూ.50 వేల రుణాలు పొందొచ్చని ఏఓ మల్లేష్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ఎఇఒ సిద్దు, సిబ్బంది వెంకటేశ్వర్లు, మారెన్న, శశికాంత్ సమక్షంలో గొల్లలదొడ్డి, బురాన్దొడ్డి గ్రామాల్లో రైతులకు, కౌలు రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఇక్కడే వర్షాబావా పరిస్థితులలో పంటల సస్యరక్షణపై అవగాహన పెంచుకోవాలని కోరారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

- వైసిపి యువజన నాయకులు ప్రదీప్ రెడ్డి

ప్రజాశక్తి - పెద్దకడబూరు

వృద్ధురాలితో మాట్లాడుతున్న ప్రదీప్ రెడ్డి

ప్రజాసంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని వైసిపి యువజన నాయకులు వై.ప్రదీప్ రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని కల్లుకుంట గ్రామంలో రోజున 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్రదీప్‌రెడ్డి హాజరయ్యారు. గ్రామంలో ప్రతి గడపకూ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలను ప్రతి ఒక్కరికీ అందుతున్నాయని తెలిపారు. వచ్చే 2024 ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వం అధికారం చేపడితే ప్రతి కాలనీకీ సిసి రోడ్లు, డ్రెయినేజీలు వేయిస్తామని హామీ ఇచ్చారు. రామ్మోహన్ రెడ్డి, పురుషోత్తం రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, మాజీ ఎంపిపి రఘురామ్, సర్పంచి ఇస్మాయిల్, మాజీ సర్పంచి సత్యనారాయణ, బాలముని, డీలర్ నర్సింగప్ప, కటిక మహ్మద్, విజయ్ కుమార్, షేర్‌ఖాన్, అమీర్ ఖాన్ పాల్గొన్నారు.

హమాలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

- సిఐటియు పట్టణ కార్యదర్శి గోపాల్

ప్రజాశక్తి - ఆదోని

హమాలీ కార్మికులకు ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సిఐటియు పట్టణ కార్యదర్శి పిఎస్.గోపాల్ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం ఆదోనిలోని సుందరయ్య భవనంలో డిగారి గేటర్ హమాలీ వర్కర్స్ యూనియన్ సమావేశం బి.రాజు అధ్యక్షతన జరిగింది. సిఐటియు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు బి.తిప్పన్న, పిఎస్.గోపాల్, ఉపాధ్యక్షులు డి.లక్ష్మన్న హాజరై మాట్లాడారు. అసంఘటిత రంగమైన హమాలీ కార్మికులకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారమూ అందడం లేదన్నారు. ప్రభుత్వం హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి గుర్తింపు కార్డులు, పింఛను సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. డిగారి గేటర్ హమాలీల కూలి రేట్ల అగ్రిమెంట్ ఆగస్టు 31కి ముగియడంతో డిమాండ్ నోటీస్ ఇవ్వాలని తీర్మానం చేశారు. అనంతరం డిగారి గేటర్ హమాలీ వర్కర్స్ యూనియన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ గౌరవాధ్యక్షులుగా పిఎస్.గోపాల్, అధ్యక్షులు బి.రాజు, కార్యదర్శి ఈరప్ప, కోశాధికారి బి.రంగ, ఉపాధ్యక్షులు ఈరన్న, వీరాంజిని, సురేష్, బసప్ప, సహాయ కార్యదర్శులుగా హుస్సేనప్ప, వీరారెడ్డి, వీరప్ప, అయ్యన్న, కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

గ్రామ యూనిట్‌గా బీమా ఇవ్వాలి

- మండల వ్యవసాయ సలహా సంఘం అధ్యక్షులు హంపి రెడ్డి

ప్రజాశక్తి - దేవనకొండ

మాట్లాడుతున్న హంపి రెడ్డి

వాతావరణ బీమా పరిహారాన్ని మండల యూనిట్‌గా కాకుండా గ్రామ యూనిట్‌గా గుర్తించి ఇవ్వాలని మండల వ్యవసాయ సలహా సంఘం అధ్యక్షులు హంపి రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో మండల వ్యవసాయ సలహా సంఘం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎఒ సురేష్ బాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడారు. ఖరీఫ్ సీజన్‌లో మండలంలో 75 వేల ఎకరాల్లో పత్తి, వేరుశనగ, చౌలకాయ, ఆముదం, టమోటా తదితర పంటల సాగు చేస్తారని తెలిపారు. ఇప్పటివరకు సుమారు 50 వేల ఎకరాల్లో పంట నమోదు జరిగిందని వివరించారు. ప్రతి రైతూ పంట నమోదు చేయించుకోవాలని, తప్పనిసరిగా ఈకేవైసీ చేయించాలని సభ్యులకు తెలిపారు. పంట నమోదు ఈనెల 15న ముగుస్తుందని, రైతులందరూ తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు. సంఘం సభ్యులు మల్లికార్జున, కందనాతి రంగన్న, ఎఇఒలు జయరాం, యోగేంద్ర, రంగన్న పాల్గొన్నారు.

బాబు, లోకేష్‌ను అరెస్టు చేయాలి

- వైసిపి సీనియర్ నాయకులు జగన్మోహన్ రెడ్డి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

సమావేశంలో మాట్లాడుతున్న జగన్మోహన్ రెడ్డి

టిడిపి అధినేత చంద్రబాబు నాయుడును, నారా లోకేష్‌ను అరెస్టు చేయాలని వైసిపి సీనియర్ నాయకులు ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి డిమాండ్ చేశారు. పుంగనూరు, భీమవరంలో హింసను ప్రేరేపించడమే కాకుండా, లా అండ్ ఆర్డర్‌ను సవ్యంగా నిర్వహిస్తున్న పోలీసులపై దాడి చేసి, వారి రక్తం కళ్ల చూశారని తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పోలీసులు సహనం కోల్పోయి కాల్పులు జరుపుతారని, కాల్పులు జరిగి ఎవరైనా మరణిస్తే వారి శవాలతో రాజకీయం చేయాలని బాబు, లోకేష్‌ల తాపత్రయమని విమర్శించారు. చంద్రబాబు, లోకేష్‌లు ప్రజలను రెచ్చగొట్టే విధంగా మాట్లాడుతూ టిడిపి కార్యకర్తలను రెచ్చగొడుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో అలజడులు సృష్టించడానికి, గొడవలు పెంచడానికి చేస్తున్న ప్రయత్నాలపై ప్రభుత్వం, పోలీసులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వచ్చే 2024 ఎన్నికల్లో టిడిపి గెలవలేదని తెలుసుకొని ఒత్తిడికి లోనై ఇలాంటి దారుణాలకు పాల్పడుతున్నారని విమర్శించారు.

ప్రత్యామ్నాయం వైపు చూపు...

- వర్షాల్లేక ఎండిపోయిన పంటలు
- కోట్లాది రూపాయల పెట్టుబడి నేలపాలు
- వర్షాల రాకతో ప్రత్యామ్నాయ పంటల సాగు

ప్రజాశక్తి-ఆలూరు

ఎండిపోయిన ఆముదం పంటను తొలగిస్తున్న కూలీలు

ఖరీఫ్ సీజన్‌లో మొదట్లో కురిసిన వర్షాలకు రైతులు పంటలను సాగు చేశారు. సకాలంలో వర్షాలు కురవకపోవడంతో పంటలు ఎండిపోయాయి. రైతుల పెట్టుబడులు నేలపాలయ్యాయి. పంటలు ఎండిపోవడంతో తొలగించారు. ఈనెలలో వర్షాలు కురవడంతో మళ్లీ వేరే పంటలను సాగు చేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు.

ఖరీఫ్ సీజన్‌లో జూన్ నెలలో వర్షం కురవడంతో ఆలూరు మండలం పెద్దహోతూరు గ్రామానికి చెందిన రైతు ఎర్రి స్వామి 5 ఎకరాల్లో ఆముదం పంట సాగు చేశారు. రూ.30 వేలకు పైగా పెట్టుబడి పెట్టారు. ఆగస్టులో వర్షాలు కురవకపోవడంతో పంట గిడసబారి ఎండిపోయింది. వర్షాలు కురవకపోవడంతో రైతుల పెట్టుబడి నేల పాలయింది. ఈనెలలో కురిసిన వర్షానికి రైతులు ఆశలు వదులుకోలేక ఎండిపోయిన ఆముదం పంటను తొలగించి మళ్లీ అప్పు చేసి జొన్న పంట సాగుకు సిద్ధమవుతున్నారు. వర్షాభావ పరిస్థితుల వల్ల ప్రతి గ్రామంలోనూ చాలామంది రైతులు ఎండిపోయిన పత్తి, ఆముదం పంటలను తొలగించి ప్రత్యామ్నాయ పంటల సాగుకు సిద్ధమవుతున్నారు.

11,188 హెక్టార్లలో పంటల సాగు

ఆలూరు మండలంలో ఖరీఫ్‌లో సాధారణ సాగు 35,945 ఎకరాలు. కాగా 27,970 ఎకరాల్లో రైతులు వివిధ పంటలను సాగు చేశారు. ప్రధానంగా పత్తి 20,175 ఎకరాలు, ఆముదం 950 ఎకరాల్లో సాగు చేశారు. ఆగస్టు నెలలో ఒక్కరోజు కూడా వర్షం కురవకపోవడంతో పంటలు పూర్తిగా ఎండిపోయాయి.

అప్పులు చేసి ప్రత్యామ్నాయ పంటలకు సిద్ధం

ఎండిపోయిన పంటలను తొలగించుకొని కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రత్యామ్నాయ పంటల సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. మొదట్లో వేసిన పంటలో దెబ్బతిని నష్టపోయిన రైతుకు గోరుచుట్టుపై రోకలి పోటు మాదిరిగా మళ్లీ అప్పు చేసి ప్రత్యామ్నాయ పంటలకు సిద్ధమవుతున్నారు.

రూ.30 వేలు నష్టపోయాను

- ఎర్రిస్వామి, రైతు పెద్దహోతూరు

ఐదెకరాల్లో రూ.30 వేలు పెట్టుబడి పెట్టి పంట సాగు చేశాను. సకాలంలో వర్షాలు కురవకపోవడంతో పంటలు ఎండిపోయాయి. పంట ఎండిపోవడంతో రూ.30 వేలు నష్టం వచ్చింది. సెప్టెంబర్‌లో వర్షాలు కురవడంతో మళ్లీ అప్పు చేసి జొన్న పంటను సాగు చేస్తున్నాను.

పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులును కలిసిన జర్నలిస్టులు

ప్రెస్‌క్లబ్ ఏర్పాటుకు సహకారం

- పీఠాధిపతులు శ్రీ సుభుదేంద్రతీర్థులు

ప్రజాశక్తి - మంత్రాలయం

పాత్రికేయులకు అవసరమైన ప్రెస్‌క్లబ్ ఏర్పాటుకు సహకరిస్తామని శ్రీమఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు తెలిపారు. శుక్రవారం ఎపిడబ్ల్యుజె నూతన కమిటీ ఆధ్వర్యంలో పీఠాధిపతులును కలిసి ప్రెస్ క్లబ్ గురించి ప్రస్తావించారు. ఈ సందర్భంగా ఎపిడబ్ల్యుజె నియోజకవర్గ నూతన అధ్యక్షులు జయరాజు, ప్రధాన కార్యదర్శి హుస్సేని, ఆర్గనైజింగ్ సెక్రటరీ సూర్య నారాయణ, కోశాధికారి సాబువలీ ఆధ్వర్యంలో పీఠాధిపతులుకు శాలువా, పూలమాల వేసి నమస్కరించుకున్నారు. పీఠాధిపతులు కూడా జయరాజును పూలమాలతో అభినందించి ఫల మంత్రాక్షతలు అందజేసి ఆశీర్వదించారు. ప్రెస్ క్లబ్ విషయంలో స్థల పరిశీలన జరుగుతోందని, త్వరలోనే స్థలాన్ని నిర్ణయించి నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు.

పీఠాధిపతుల నిర్ణయమే శిరోధార్యం

- మేనేజర్ శ్రీనివాసరావు

శ్రీమఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు నిర్ణయమే శిరోధార్యమని మేనేజర్ ఎస్‌కె.శ్రీనివాసరావు తెలిపారు. ఎపిడబ్ల్యుజె నూతన కమిటీ ఆధ్వర్యంలో పరిపాలన కార్యాలయంలో ఆయనను కలిసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. పాత్రికేయులకు సహాయ, సహకారాలు అందించాలని మేనేజర్‌ను కోరగా ఆయన పైవిధంగా స్పందించారు. ఏ విషయమైనా పీఠాధిపతులతో చర్చించి హామీ ఇస్తామని తెలిపారు.

వర్షాకాలంలోనూ తాగునీటికి కటకట

- మిట్టసోమాపురం దుస్థితి

ప్రజాశక్తి - నందవరం

ఓ వైపు 50 వేల క్యూసెక్కులతో తుంగభద్ర నది ప్రవహిస్తున్నా మిట్ట సోమాపురం గ్రామంలో తాగునీటి ఎద్దడి నెలకొంది. నది నుంచి ఫిల్టర్ బెడ్ ద్వారా రోజువారీగా తాగునీటిని సరఫరా చేస్తున్నా సర్పంచి, అధికార పార్టీ నాయకులు, అధికారుల నిర్లక్ష్యం వల్ల గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా మారింది. అప్పుడప్పుడు వర్షాలు కురుస్తున్నా సమస్య మాత్రం తీరడం లేదు. అధికారులు, నాయకుల నిర్లక్ష్యంతో తాగునీటిని సరఫరా చేసే సిబ్బంది 'మోటార్లు చెడి పోయాయ'ని నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారు. మోటార్ల మరమ్మతులు అనే కారణంతో రెండు, మూడు రోజులకు ఒకసారి నీరందక గ్రామస్తులు అవస్థలు పడుతున్నారు. అధికార పార్టీ నాయకులు సంబంధిత అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదని, ఎంపిపి నిధుల కింద తాగునీటి కోసం రూ.7 లక్షలు ఖర్చు చేశామని చెబుతున్నారని ప్రజలు వాపోతున్నారు. సర్పంచి ఆ నిధులను ఏయే పనులకు ఖర్చు చేశారో చెప్పాలని కోరుతున్నారు. సర్పంచి, సంబంధిత అధికారులు స్పందించి తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

తాగునీటిని నింపుకునేందుకు వేచి ఉన్న ప్రజలు

వైభవంగా ఉలిగమ్మ అవ్వ కుంభోత్సవం

ప్రజాశక్తి - హొళగుంద

హొళగుందలో వెలసిన ఉలిగమ్మ అవ్వ కుంభోత్సవం రజకుల ఆధ్వర్యంలో వైభవంగా సాగింది. శ్రావణమాసం నాలుగో శుక్రవారం సందర్భంగా ఈ కుంభోత్సవాన్ని నిర్వహించారు. గ్రామంలోని పెద్దబావి వద్ద నుంచి గంగిపూజ చేసి భక్తులు మేళతాళాలు, డప్పు, వాయిద్యాల మధ్య కుంభాన్ని పురవీధుల గుండా ఊరేగించారు. స్థానిక చాకలి వీధి వద్ద వెలసిన ఉలిగమ్మ అవ్వ ఆలయానికి తీసుకొచ్చారు. ఆలయంలో స్వామి వారికి ఆకుపూజ, మహామంగళ హారతి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వచ్చిన భక్తులకు రజక సంఘం, గ్రామ పెద్దలు అన్నదానం ఏర్పాటు చేశారు.

వేధిస్తున్న యూరియా కొరత...

- కృత్రిమ కొరత సృష్టే కారణం
- ఇబ్బంది పడుతున్న రైతులు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

యూరియా కొరత రైతులను వేధిస్తోంది. అవసరం మేరకు యూరియా దొరకక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. తొలి విడత ఎరువు వేసే సమయం దాటిపోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కొందరు వ్యాపారులు కుమ్మక్కై కృత్రిమ కొరత సృష్టిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు విత్తనాలు, ఎరువులు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అవసరమైన ఎరువులు కావాల్సిన రైతులు కియోస్క్ వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాలి. వివరాలు నమోదు చేసుకున్నా సకాలంలో ఎరువులు అందుబాటులోకి రాకపోవడంతో ఇటు అధికారులు, అటు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. యూరియా కోసం రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాకు సరిపడే యూరియా సరఫరా కాకపోవడంతో రైతులకు పడిగాపులు తప్పడం లేదు. ఇదే అదనుగా ఇటు డీలర్లు, అటు వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. యథేచ్ఛగా బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తూ చీకటి వ్యాపారం సాగిస్తున్నారు. ఆదోని డివిజన్ కేంద్రంగా ఇతర రాష్ట్రాలకు సైతం తరలిస్తున్నారు.

నిజంగా యూరియా కొరత ఉందా..!

జిల్లాలో యూరియా కొరతపై అధికారులు రైతులకు స్పష్టత ఇవ్వలేకపోతున్నారు. కనీసం రైతుల అవసరాలను గుర్తించి యూరియా కొరతపై అధికారులు ప్రచారం నిర్వహించ లేకపోతున్నారు. యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నా ఏమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. జిల్లాలో ఇప్పటివరకు ఎంత యూరియా ఎక్కడెక్కడ అందుబాటులో ఉందన్న విషయాన్ని అధికారులు ప్రకటించలేదు. ఐదు రోజులుగా కురుస్తున్న చదురుమదురు వర్షాలతో పంటలకు యూరియా కోసం రైతులు దుకాణాల వద్దకు పరుగులు తీస్తున్నారు.

ఇతర ఎరువులు కొంటేనే యూరియా

డీలర్ల నుంచి రిటైల్ వ్యాపారులు యూరియా కావాలని అడిగితే 12 శాతం జింక్‌తో పాటు వేరే రకాల ఎరువులను కొనుగోలు చేస్తేనే యూరియా విక్రయిస్తామని మెలిక పెడుతున్నారు. యూరియా వారి వద్ద ఉంచుకుని, కృత్రిమ కొరత సృష్టించడంతో రైతులకు సకాలంలో యూరియా అందుబాటులోకి రావడం లేదు. ఈ సీజన్‌లో యూరియా అవసరమవుతుంది. మార్క్‌ఫెడ్ ద్వారా ఆర్‌బికెలకు యూరియాను పంపుతున్నామని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నా ఆర్‌బికెలకు వచ్చిన యూరియా ఎటువైపునకు తరలిపోతుందో తెలియని స్థితి. ఆర్‌బికెలతో సంబంధం లేకుండా వ్యాపారుల కోటా కింద యూరియాను సరఫరా చేశామని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ స్టాక్ ఎక్కడుందో తెలియని పరిస్థితి. ప్రస్తుతం రైతులు ఎరువులు చల్లే కాలం కావడంతో యూరియా కృత్రిమ కొరతను సృష్టించి వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు.

మొండి బకాయిలు చెల్లించండి

- సహకార సంఘం అధ్యక్షులు ఉనేబాదు మల్లికార్జున

ప్రజాశక్తి - చిప్పగిరి

బెల్డోన సహకార సంఘంలో మొండి బకాయిలు ఉన్న రైతులందరూ వెంటనే చెల్లించి మళ్లీ రుణాలు పొందవచ్చని బెల్డోన సహకార సంఘం అధ్యక్షులు ఉనేబాదు మల్లికార్జున తెలిపారు. శుక్రవారం చిప్పగిరిలోని సహకార సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడారు. రుణాలు పొందిన రైతులు ఒక క్రమ పద్ధతిలో చెల్లించాలని తెలిపారు. వారికి ప్రభుత్వం చెల్లించిన వడ్డీలను మళ్లీ వారి ఖాతాలకు జమ చేస్తామని చెప్పారు. సహకార సంఘంలో ముగ్గురు డైరెక్టర్లు ఉండగా అదనంగా మరో ఏడుగురిని డైరెక్టర్లుగా తీసుకున్నట్లు తెలిపారు. మొత్తం పదిమందిలో ఇద్దరు కో ఆప్షన్ సభ్యులుగా ఉంటారన్నారు. రైతులకు సత్వరమే రుణాలు అందించేందుకు సహకార సంఘం ముందుంటుందని తెలిపారు. సిఇఒ హరికృష్ణ, క్లర్కు ముక్కన్న, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ సాయమందేలా కృషి : ఎఒ

ప్రజాశక్తి - దేవనకొండ

గత రెండు రోజుల క్రితం అప్పుల బాధతో మృతి చెందిన కౌలు రైతు చిగిలి నరసప్ప కుటుంబాన్ని ఎఒ సురేష్ బాబు శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఆత్మహత్య నివేదిక వివరాలను సంబంధిత ఉన్నతాధికారులకు పంపినట్లు తెలిపారు. ప్రభుత్వ సహాయం మంజూరయ్యేలా కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. విఆర్ఒ జాకీర్ హుస్సేన్, ఎఇఒలు జయరామ్, రంగన్న పాల్గొన్నారు.

సైబర్ క్రైమ్‌పై అవగాహన సదస్సు

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో త్రీ టౌన్ స్టేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం బాలికలకు సైబర్ క్రైమ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. త్రీ టౌన్ ఎస్ఐ విజయలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమాజంలో బాలికలు ఎదుర్కొంటున్న సమస్యలు, సైబర్ నేరాలు, నెట్ వాడకం, ప్రేమ వివాహాలు వాటి పర్యావసానాలు వంటి అనేక విషయాలపై బాలికలు అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. సైబర్ నేరం జరిగిన వెంటనే 1930కి ఫోన్ చేయాలని తెలిపారు. పోలీసు సిబ్బంది రాజేశ్వరి, ముంతాజ్ బేగం, వెంకట లక్ష్మి, కళాశాల ఎన్ఎస్ఎస్ డివిజన్ అధికారి జొనాథన్, అధికారులు, ఉమాదేవి, వెంకట్రామిరెడ్డి, ఈరమ్మ, బాలికలు పాల్గొన్నారు.

15లోపు పంట నమోదు పూర్తి

- ఎమ్మిగనూరు ఎడిఎ ఖాద్రీ, ఎఒ హేమలత

ప్రజాశక్తి - గోనెగండ్ల

ఈనెల 15లోపు పంట నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని ఎమ్మిగనూరు ఎడిఎ ఖాద్రీ, ఎఒ హేమలత తెలిపారు. శుక్రవారం గోనెగండ్లలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో వ్యవసాయ సలహా సమావేశం నిర్వహించారు. ఎమ్మిగనూరు ఎడిఎ ఖాద్రీ, ఎఒ హేమలత హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈనెల 15లోపు రైతులందరూ పంటల నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని తెలిపారు. ఈకేవైసీని కూడా స్థానిక సచివాలయంలో వ్యవసాయ సహాయకుని సంప్రదించి చేసుకోవాలని చెప్పారు. అనంతరం మండలంలోని పుట్టపాశం, వెముగోడు, తిప్పనూరు రైతు భరోసా కేంద్రాలను సందర్శించారు. ప్రజలకు అవసరమైన అన్ని రకాల ఎరువులు ఆర్‌బికెలలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వ్యాధులపై అప్రమత్తత అవసరం

- పశు వైద్యులు డాక్టర్ అశోక్ కుమార్

ప్రజాశక్తి - మంత్రాలయం

పశువులకు వచ్చే వ్యాధులపై పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలని పశు సంవర్ధక శాఖ వైద్యులు డాక్టర్ అశోక్ కుమార్ సూచించారు. శుక్రవారం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని కలుదేవకుంట గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గ్రామీణ పశు వైద్య కేంద్రంలో 'పశు విజ్ఞానబడి' నిర్వహించారు. కలుదేవకుంట ప్రాథమిక సహకార సంఘం ఛైర్మన్ కె.రఘునాథ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడారు. వర్షాకాలంలో పశువులకు వచ్చే వ్యాధులు, వాటి నివారణ చర్యల గురించి అవగాహన కల్పించారు. వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా రైతులు పశువులకు అవసరమైన పశు గ్రాసాలను సాగు చేసుకోవాలని తెలిపారు. శాస్త్రీయ పద్ధతుల్లో పొదుపుగా వాడుకొని రైతులు పాల దిగుబడి ఏ విధంగా పొందాలో వివరించారు. రైతులకు 20 యూనిట్ల సంపూర్ణ మిశ్రమ దాణాను సబ్సిడీపై మంజూరు కాగా పంపిణీ చేశారు. వరప్రసాద్ పాల్గొన్నారు.

గూళ్యంలో పెరుగుతున్న అక్రమ కట్టడాలు

- అధికారులు చర్య తీసుకోవాలి

- ఎంఆర్‌పిఎస్

ప్రజాశక్తి-హాలహర్వి

మండలంలోని గూళ్యం గ్రామంలో రహదారి గుండా అక్రమ కట్టడాలను అరికట్టాలని ఎంఆర్‌పిఎస్ మండల కన్వీనర్ ఎల్లప్ప డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గూళ్యంలోని శ్రీగాదిలింగేశ్వర స్వామి దేవాలయం ప్రసిద్ధి చెందిందని తెలిపారు. ప్రతేడాది శివరాత్రి తర్వాత పంచమి నాడు జోడు రథోత్సవం వైభవంగా జరుగుతుందని చెప్పారు. ఈ రథోత్సవాన్ని తిలకించడానికి లక్షల్లో భక్తులు తరలివస్తారని తెలిపారు. అలాంటి దేవాలయం ముందు ప్రధాన రహదారిలో అక్రమంగా ఇల్లు కట్టుకొని రేకుల షెడ్డు వేశారని చెప్పారు. గ్రామంలో రాజకీయాలకు అతీతంగా అక్రమ కట్టడాలపై అధికారుల దృష్టికి తీసుకెళ్లి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. అక్రమ నిర్మాణాలను అడ్డుకోక పోతే శ్రీగాదిలింగేశ్వర స్వామి రథం లాగేందుకు ఇబ్బందులకు గురవుతారన్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. దళిత సంఘం నాయకులు గోవిందు, గాదిలింగప్ప, విజయ్, నవీన్ పాల్గొన్నారు.

మతోన్మాదానికి వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాలు

- జేమ్స్ ప్రథమ వర్ధంతి సభలో వక్తల పిలుపు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న మతోన్మాదానికి వ్యతిరేకంగా ఐక్యంగా పోరాడే శక్తులు ముందుకు రావాలని సిపిఐ (ఎంఎల్) ప్రతిఘటన కేంద్ర కమిటీ కార్యదర్శి షేక్షావలీ కోరారు. శుక్రవారం సిపిఐ (ఎంఎల్) ప్రతిఘటన కేంద్ర కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మిగనూరులోని సాగునూరు రోడ్డులో ఉన్న మంగళ హనుమంతు, జేమ్స్ భవనం (పార్టీ కేంద్ర కార్యాలయం)లో ఐఎఫ్‌టియు జాతీయ నేత కదిరికోట జేమ్స్ ప్రథమ వర్ధంతి సభ నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘం జిల్లా కార్యదర్శి బి.ఏసేపు అధ్యక్షత వహించారు. జేమ్స్ సతీమణి కె.దానమ్మ, షేక్షావలీ, సిపిఐ (ఎంఎల్) ఆర్ఐ సెంట్రల్ కమిటీ మెంబర్ గడ్డం సదానందం, సిపిఐ (ఎంఎల్) భహుజన ప్రజారాజ్యం రాష్ట్ర కార్యదర్శి అనిశెట్టి రాము, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ సత్తెన్న, బాలరాజు, బీసీ సంఘం గణేష్, మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి నర్సన్న, నవ్యాంధ్ర ప్రదేశ్ జిల్లా అధ్యక్షులు అమరేష్, అడ్వకేట్ చార్లెస్, పిఒడబ్ల్యు (విముక్తి) ఎం.పుణ్యవతి, ఐఎఫ్‌టియు రాష్ట్ర కార్యదర్శి కె.నర్సన్న, జిల్లా కన్వీనర్ కెఎమ్‌డి.హనీఫ్, హైదరాబాద్ కన్వీనర్ బడిగే వెంకటేష్, చేనేత సంఘం నీలకంఠ, పిడిఎస్‌యు (ప్రభంజనం) కన్వీనర్ ఎం.ప్రకాష్, ఆంధ్ర, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శులు కొలిమి ప్రసాద్, ఎస్‌కె.సైదులు, సీనియర్ కార్మికోద్యమ నేత నేతప్ప, పివైఎల్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ బానోత్ సంతోష్ నాయక్, జిల్లా కన్వీనర్ కె.చిన్ని ప్రసాద్, అరుణోదయ పి.సంపత్, ప్రజా కవి, కళాకారుడు రాంచంద్రన్న, విప్లవ అభిమానులు లక్ష్మణ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తమిళనాడు ముఖ్యమంత్రి కుమారుడు, రాష్ట్ర మంత్రి ఉదయనిధి స్టాలిన్‌పై అయోధ్య పీఠాధిపతి స్వామి పరమహంస చేసిన హత్య బెదిరింపు చర్యలు సిగ్గు చేటని విమర్శించారు. భావ ప్రకటన స్వేచ్ఛపై మనువాద సిద్ధాంత కాషాయ సంఘ్ పరివార్ శక్తులు జరుపుతున్న దాడులు వ్యతిరేకించాలని కోరారు. సభ ప్రారంభంలో జేమ్స్ చిత్రపటానికి పూలమాలలు వేసి, సంతాప సూచికంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. చివరలో జేమ్స్ ఆశయ సాధనకు పోరాడతామని వక్తలు ప్రతిన బూనారు.

జేమ్స్‌కు శ్రద్ధాంజలి ఘటిస్తున్న నాయకులు

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

- టిడిపి సీనియర్ నాయకులు ఉలిగయ్య

ప్రజాశక్తి - కౌతాళం

టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టిడిపి సీనియర్ నాయకులు ఉలిగయ్య తెలిపారు. శుక్రవారం మండలంలోని గోతులదొడ్డి గ్రామంలో 'భవిష్యత్తుకు గ్యారెంటీ' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 'భవిషత్తుకు గ్యారెంటీ' ద్వారా చేపట్టే పథకాలను ప్రజలకు వివరించారు. ఈ 4 ఏళ్ల 4 నెలల్లో జగన్ ప్రభుత్వంపై ప్రజలు విసుగు చెందారని తెలిపారు. ఈ రాష్ట్ర బాగు కోసం ప్రతి ఇంటి నుంచి ఒకరు కదం తొక్కాలని కోరారు. రాబోయే ఎన్నికల్లో టిడిపిని గెలించుకునేందుకు ప్రతి కర్యకర్త సైనికునిలా పనిచేయాలని తెలిపారు. సర్పంచి గోవిందు, మహంతేష్, సోమేష్, నాగరాజు, దుర్గయ్య, సోము, నాగేష్ పాల్గొన్నారు.

పథకాలను వివరిస్తున్న నాయకులు

చేతులను శుభ్రం చేసుకోవాలి

- నవోదయ 'హ్యాండ్ వాష్' కార్యక్రమం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

చేతులను తరచూ శుభ్రం చేసుకోవాలని ఉపాధ్యాయులు విద్యార్థులకు సూచించారు. శుక్రవారం బనవాసిలోని జవహర్ నవోదయ విద్యాలయం ఆధ్వర్యంలో ప్రతేడాది నిర్వహించే 'పేస్ సెట్టింగ్' కార్యక్రమంలో భాగంగా విద్యాలయ సమీపంలోని హనుమాపురం ఎంపియుపి పాఠశాలలో 'హ్యాండ్ వాష్' కార్యక్రమం నిర్వహించారు. ఆరోగ్యం, పరిశుభ్రత, చేతులను ఎలా శుభ్రం చేసుకోవాలని విద్యార్థులకు అవగాహన కల్పించారు. జవహర్ నవోదయ విద్యాలయ ఇన్‌ఛార్జీ ప్రిన్సిపల్ కె.చందిరన్, ఉపాధ్యాయులు బసవరాజ్, మీనా చంద్రన్, ఎం.వెంకటేష్, సోనమ్ కుమారి, యోగేష్, చాంద్, ఎంపియుపి స్కూల్ ప్రధానోపాధ్యాయులు జి.సత్య కరుణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

ఎస్‌ఎఫ్‌ఐ నాయకునిపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

- వైఎస్ఆర్ సర్కిల్ వద్ద ఎస్ఎఫ్ఐ నిరసన

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

దేశంలో రోజురోజుకు ఎబివిపి నాయకుల దాడులు పెరిగిపోతున్నాయని, ఎస్ఎఫ్ఐ నాయకునిపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రంగప్ప, పట్టణ కార్యదర్శి విజయ్ డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో గురువారం రాత్రి ఎస్ఎఫ్ఐ నాయకులపై జరిగిన దాడిని ఖండిస్తూ శుక్రవారం పట్టణంలోని వైఎస్ఆర్ సర్కిల్‌లో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర ప్లీనరీ ఈనెల 8 నుంచి 10 వరకు జరుగుతున్నాయని తెలిపారు. సంగారెడ్డిలోని గురువారం రాత్రి ఎస్ఎఫ్ఐ జెండాలు, తోరణాలతో ముస్తాబు చేస్తున్న నాయకులపై ఎబివిపి నాయకులు దాడి చేసి గాయపరిచారని చెప్పారు. ఆ దాడిలో సంగారెడ్డి జిల్లా కార్యదర్శి రమేష్ తలకు బలమైన గాయమైందని, ఇతర నాయకులకు స్వల్ప గాయాలయ్యాయని తెలిపారు. వారిని వైద్యం నిమిత్తం సంగారెడ్డి జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారని చెప్పారు. దాడికి పాల్పడిన ఎబివిపి నాయకులను అరెస్టు చేసి తక్షణమే రిమాండ్‌కు తరలించాలని డిమాండ్ చేశారు. ఎబివిపిని దేశంలో లేకుండా బ్యాన్ చేయాలని తెలిపారు. రఘు, ఆనంద్, మోహన్, ప్రమోద్, పవన్, సుభానా పాల్గొన్నారు.

ఎమ్మిగనూరులో నిరసన తెలియజేస్తున్న నాయకులు

ఆదోని పట్టణంలోని పోలీసు కంట్రోల్ రూమ్ సర్కిల్‌లో నిరసన చేపట్టారు. ఎస్ఎఫ్ఐ నాయకులు శ్రీనివాసులు, గణేష్ పాల్గొన్నారు

12న మెగా జాబ్ మేళా

- రావుస్ కళాశాల సిఇఒ తిరుమలరెడ్డి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

కరపత్రాన్ని విడుదల చేస్తున్న తిరుమలరెడ్డి

పట్టణంలోని రావుస్ డిగ్రీ కళాశాలలో ఈనెల 12న నిర్వహించే మెగా జాబ్ మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని రావుస్ కళాశాల సిఇఒ తిరుమల రెడ్డి కోరారు. శుక్రవారం మెగా జాబ్ మేళాకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నిరుద్యోగ యువత కోసం చేపట్టిన ఉద్యోగ యజ్ఞం స్ఫూర్తిగా రావుస్ కళాశాలలో ఎపి ఎస్ఎస్‌డిసి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి అధ్యక్షతన 25 బహుళ జాతీయ కంపెనీలతో మెగా జాబ్ మేళా నిర్వహించడం గర్వంగా ఉందన్నారు. రావుస్ కళాశాల ద్వారా పేద విద్యార్థులకు ఉన్నత విద్యను అందించడంతోపాటు నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించాలని మెగా జాబ్‌మేళా నిర్వహిస్తునట్లు తెలిపారు. రావుస్‌లో నిర్వహించే జాబ్‌మేళాకు ఎమ్మిగనూరు పట్టణ, పరిసర ప్రాంతాల నిరుద్యోగులు, ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఆసక్తి ఉన్న నిరుద్యోగ యువత ఈనెల 11లోపు www.Apssdc.in ద్వారా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. ఇతర వివరాల కోసం టోల్ ఫ్రీ నెంబర్లు 9988853335, 779921656, 9985496587, 8885904099కు సంప్రదించాలని కోరారు. ఎపి ఎస్ఎస్‌డిసి ప్లేస్‌మెంట్ ఆఫీసర్ సాయి తేజ, కోఆర్డినేటర్ నరసప్ప పాల్గొన్నారు.

జగనన్న కాలనీకి బ్రిడ్జిలు నిర్మించాలి

- సిపిఎం మండల కార్యదర్శి లింగన్న

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ఎంపిడిఒకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

జగనన్న కాలనీకి వెళ్లాలంటే లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని, వంకపై బ్రిడ్జిలు నిర్మించాలని సిపిఎం మండల కార్యదర్శి కె.లింగన్న డిమాండ్ చేశారు. శుక్రవారం ఎంపిడిఒ గీతావాణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న కాలనీలో సుమారు 97 మందికి పట్టాలు పంపిణీ చేశారని తెలిపారు. నిర్మాణంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు. జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణం జరగాలంటే, వంక అడ్డంగా ఉందని తెలిపారు. వంకపై బ్రిడ్జిలు నిర్మించి ఇస్తామని చెప్పిన అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం వహిస్తున్నారని చెప్పారు. ఈ రస్తా వెంట సుమారు 300 ఎకరాలకు సంబంధించిన 40 మంది రైతులు ఎరువులు, విత్తనాలు, పంట కోత సమయంలో దిగుబడులు తీసుకురావడానికి సమస్యగా ఉందని తెలిపారు. బ్రిడ్జిలు నిర్మించి జగనన్న కాలనీ లబ్ధిదారులకు, రైతుల సమస్య పరిష్కరించాలని కోరారు. కొండ పక్కన బసవేశ్వర దేవాలయం దగ్గర నిరుద్యోగ యువత ప్రిపరేషన్ కోసం వెళుంటారని, వారికి ఇబ్బంది లేకుండా చూడాలని తెలిపారు. ఈ సమస్యను గతంలో ఎన్నోసార్లు ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకొచ్చినా నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. వెంటనే బ్రిడ్జిలు నిర్మించి లబ్ధిదారులు ఇల్లు నిర్మించుకునే విధంగా పాలకులు, అధికారులు సహకరించాలని కోరారు. లేకపోతే సిపిఎంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రామకృష్ణ, నర్సప్ప, బంగారయ్య, హుస్సేని, తాయప్ప, నాగరాజు పాల్గొన్నారు.